నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 21-2-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :26 సంచిక: 177 పేజీలు: 4 వెల: రూ.1/-

ఎస్సీ బాలికల వసతి గృహాన్ని సందర్శించిన కేటీఆర్

సిరిసిల్ల, ఫిబ్రవరి 20, (నేటినిజం ప్రతినిది): రాజన్న సిరిసిల్ల జిల్లాలో మంత్రి కేటీఆర్ పర్యటించారు. సిరిసిల్ల పట్టణంలోని ఎస్సీ బాలికల వసతి గృహాన్ని సందర్శించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... బాలికలను వేధింపులకు గురిచేసిన పార్టీ నాయకులను సస్పెండ్ చేశాం. ఇలాంటి దురాగతాలకు పాల్పడే ఘటనలపై అమ్మాయిలు గొంతెత్తాలి.

అమ్మాయిలను వేధించిన దేవయ్యపై కఠిన చర్యలు తీసుకుంటాం. వసతిగృహాల్లో రక్షణచర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించాం. ఆడపిల్లలకు ఆత్మరక్షణ కోసం శిక్షణ శిబిరాన్ని చేపడతాం. ఇలాంటి సంఘటనలు ఎక్కడా పునరావృతం కాకూడదని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

నిర్భయ దోషుల కొత్త ఎత్తులు

ఉరి తప్పించుకునేందుకు మాస్టర్ ప్లాన్
జైలుగోడలకు తలతో బాదుకున్న వినయ్ శర్మ
16న జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి

న్యూఢిల్లీ,ఫిబ్రవరి20(ఆర్ఎన్ఎ): ఉరిశిక్ష అమలు కాకుండా ఇప్పటికే అనేకప్రయత్నాలు చేసిన..నిర్భయ దోషులు కొత్త ఎత్తులు వేస్తున్నారు. తాజాగా తీహార్ జైల్లో నిర్భయ దోషి వినయ్ కుమార్ శర్మ ఆత్మహత్యాయత్నం చేశాడు. ఇలా చేయడం వల్ల ఉరి ఆలస్యం కావచ్చన్న భావనలో ఉన్నట్లుగా తెలుస్తోంది. జైలు గోడకు తల బాదుకోవడంతో వినయ్ శర్మకు గాయాలు అయ్యాయి. దీంతో అతడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు జైలు అధికారులు. ఈ నెల 16న వినయ్ శర్మ ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మార్చి 3న ఉదయం 6 గంటలకు నిర్భయ దోషులకు ఉరిశిక్ష అమలు చేయాలని న్యాయస్థానం డెత్ వారెంట్ జారీచేసిన విషయం తెలిసిందే. నలుగురు దోషులనూ మార్చి 3న ఉదయం 6 గంటలకు తీహార్ జైల్లో ఉరితీయనున్నారు. ఈ నేపథ్యంలో నిర్భయ దోషుల్లో ఒకరైన వినయ్ శర్మ ఉరిని తప్పించుకునే క్రమంలో అనారోగ్యానికి గురయ్యేలా యత్నాలు మొదలు పెట్టాడు. తీహార్ జైలులో అత్యంత కట్టుదిట్టమైన భద్రత మధ్య ఉన్న నిర్భయ దోషి వినయ్ శర్మ.. తన సెల్‌లోని గోడకు తల బాదుకున్నట్లు తెలుస్తోంది. దీనిని గమనించిన సిబ్బంది అతడిని వైద్యం కోసం హుటాహుటిన హాస్పిటల్‌కు తరలించారు.

ఫిబ్రవరి 16న జరిగిన ఈ ఘటన.. ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వినయ్ శర్మ గోడకు తల బాదుకుని గాయపర్చుకున్నాడు. ఊచల మధ్య చెయ్యి ఇరికించుకుని విరగొట్టుకోవాలని యత్నించినట్లు కూడా సమాచారం. మరణశిక్ష నుంచి బయటపడటానికి దారులన్నీ మూసుకుపోవడంతో వినయ్ శర్మ ఈ మార్గాన్ని ఎంచుకున్నట్టు తెలుస్తోంది. అతని మానసిక పరిస్థితి బాగాలేదని చెప్పి ఉరిని తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నట్టు తెలుస్తోంది. వినయ్ శర్మ తరఫు న్యాయవాది కూడా.. వినయ్ శర్మ మానసిక వ్యాధికి గురయ్యాడని, మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న అతడికి ఉరి అమలు చేయడం కష్టమని తెలిపారు. ఇదంతా చూస్తుంటే ఉరిని తప్పించుకోవడానికి ఎన్ని డ్రామాలైన ఆడేలా ఉన్నారు. ఇప్పటికే రెండు సార్లు వాయిదా పడిన ఉరి.. మార్చి 3న అయినా వారి మెడకి పడుతుందేమో చూడాలి.జైలులో వినయ్‌పై దాడి జరిగిందని, తలకు గాయమైందని, దీంతో అతడు మానసిక సమస్యలతో బాధపడుతున్నాడని చెప్పారు. అందువల్ల అతనికి మరణశిక్షను అమలు చేయరాదని అతని తరఫున న్యాయవాది తెలిపారు. ఈ నేపథ్యంలో వినయ్ విషయంలో చట్టం ప్రకారం వ్యవహరించాలని తీహార్ జైలు సూపరింటెండెంట్‌ను కోర్టు ఆదేశించింది. ఇక పవన్ తరఫు న్యాయవాది మాట్లాడుతూ, సుప్రీంకోర్టులో క్యూరేటివ్ పిటిషన్, రాష్ట్రపతి వద్ద క్షమాభిక్ష పిటిషన్ దాఖలు చేయాలను కుంటున్నామని చెప్పారు. నలుగురు దోషుల్లో పవన్ మాత్రమే ఇంతవరకు క్యూరేటివ్ పిటిషన్ దాఖలు చేయలేదు, రాష్ట్రపతిని క్షమాభిక్ష కోరలేదు. రాష్ట్రపతిని తాము మరోసారి క్షమాభిక్ష కోరనున్నామని అక్షయ్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. అయితే ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన వారం రోజుల గడువు ముగిసిందని, దోషులకు సంబంధించి ఎటువంటి పిటిషన్ ఏ కోర్టులోనూ పెండింగ్‌లో లేదని పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజీవ్ మోహన్ కోర్టుకు తెలిపారు. ఈ నేపథ్యంలో ట్రయల్ కోర్టు మార్చి 3న నలుగురిని ఉరితీయాలని తాజా డెత్ వారంట్లు జారీ చేసింది

బలవంతపు పెళ్లిని రద్దు చేసిన పాక్ కోర్టు

కరాచీ,ఫిబ్రవరి20(ఆర్ఎన్ఎ): హిందూ బాలికను ఓ యువకుడు బలవంతంగా ఇస్లాంలోకి మార్చి చేసుకున్న పెళ్లిని పాకిస్థాన్ కోర్టు రద్దు చేసింది. పాక్‌లో ఇలాంటి తీర్పు బహుశా ఇదే మొదటిది. ఈ ఘటన సింధ్ ప్రావిన్స్ జకోబాబాద్ జిల్లాలో జరిగింది. 9వ తరగతి చదువుతున్న తన కుమార్తెను జనవరి 15న అలీ రజా సోలంగి కిడ్నాప్ చేసి, మతం మార్చి పెళ్లి చేసుకున్నాడని తండ్రి ఫిర్యాదు చేశాడు. దీనిపై అక్కడి హిందూ సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేశాయి. బలవంతపు మతం మార్పిళ్లపై మండిపడ్డారు. దీంతో పాక్ కోర్టు తీర్పు వారికి ఊరటనిచ్చింది.

. పల్లె నిద్రలో భాగంగా తన స్వగ్రామం మహబూబాబాద్ జిల్లా పెద్ద తండాలో నిద్ర చేసిన అనంతరం గురువారం ఉదయం సరదాగా స్కూలు పిల్లలను పరామర్శించిన మంత్రి సత్యవతి రాథోడ్

ఇప్పటి సర్పంచ్‌లు అదృష్టవంతులు: మంత్రి సత్యవతి రాథోడ్

ములుగు, ఫిబ్రవరి20: ఇప్పుడున్న సర్పంచ్‌లు అదృష్టవంతులని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. పంచాయతీరాజ్ చట్టంపై అవగాహన కల్పించేందుకు ములుగు జిల్లా లీలా గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన పంచాయతీరాజ్ సమ్మేళనానికి మంత్రి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ... అప్పటి సర్పంచులకు అరకొర నిధులు వచ్చేవన్నారు. అవి తాగునీటి అవసరాల కోసం కూడా చాలేవి కాదన్నారు.

కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే ధర్నాలు జరిగేవన్నారు. కానీ ఇప్పుడు టీఆర్ఎస్ ప్రభుత్వంలో నిధుల సమస్య లేదన్నారు. మిషన్ భగీరథ కింద తాగునీరు, వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన కరెంట్ ఇస్తున్నారన్నారు. ఊరి పారిశుద్ధ్యం కోసం ట్రాక్టర్లు ఇస్తున్నారన్నారు. పల్లెల్లో ఇప్పుడు మంచి ప్రగతి కనిపిస్తోంది. ఆర్థిక మాంద్యం ఉన్నా పల్లె ప్రగతికి సీఎం కేసీఆర్ అత్యంత ప్రాధాన్యత ఇచ్చి నెలకు రూ.338 కోట్లు క్రమం తప్పకుండా ఇస్తున్నారన్నారు. కలెక్టర్ దగ్గర ఉన్న నిధులు కూడా బాగా పనిచేసిన వారికి ఇవ్వాలని నిర్ణయించారన్నారు. కాబట్టి ఇప్పుడున్న సర్పంచ్‌లు పోటీపడి పనిచేసి పల్లె ప్రగతి చేపట్టాలని పిలుపునిచ్చారు. పల్లె ప్రగతి విజయవంతానికి సీఎం కేసీఆర్‌తో పాటు మంత్రులు, అధికారులు పల్లె నిద్ర చేయనున్నట్లు తెలిపారు. సర్పంచ్‌లుగా ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని సూచించారు. క్రమంగా అడవులు కనుమరుగు అవుతున్నాయని హరితహారంలో భాగంగా ములుగు జిల్లా వాసులు అడవిని కాపాడే బాధ్యత తీసుకోవాలని కోరారు. రాజకీయాలు ఎన్నికలప్పుడు మాత్రమేనని తర్వాత అభివృద్ధి కోసం అందరూ కలిసి పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సీతక్క, జడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్, కలెక్టర్ కృష్ణ ఆదిత్య, ఎస్పీ సంగ్రామ్ సింగ్, ఏటూరు నాగారం పి.వో. హనుమంతు, డీఎఫ్‌వో ప్రవీణ్‌శెట్టి, జడ్పీ సీఈవో పారిజాతం, ఇతర అధికారులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగుల భద్రతకు ప్రత్యేక యాప్

మహిళల భద్రతే తమ ప్రథమ లక్ష్యం
ఐటీ కారిడార్‌లో 24గంటల పాటు గస్తీ బృందాలు
మహిళా సాధికారత సదస్సులో సజ్జనార్

హైదరాబాద్,ఫిబ్రవరి20(ఆర్ఎన్ఎ): సైబరాబాద్ ఐటీ కారిడార్ పరిధిలోని మహిళా ఉద్యోగుల భద్రత కోసం షీ సేఫ్ అనే ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తేనున్నట్లు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తెలిపారు. హెచ్ఐఐసీలో సైబరాబాద్ పోలీసులు, సొసైటీ ఫర్ సెక్యూరిటీ కౌన్సిల్ సంయుక్తాధ్వర్యంలో మహిళా సాధికారత సదస్సు జరిగింది. ఈ సదస్సులో సైబరాబాద్ పోలీసు కమిషనర్ సజ్జనార్, ఐజీ స్వాతిలక్రా, టెస్సీ థామస్, సినీనటి సాయిపల్లవితో పాటు పలువురు పాల్గొన్నారు. మహిళల భద్రత, ఇతర అంశాలపై ఈ సదస్సులో చర్చించారు. ఈ సందర్భంగా సీపీ సజ్జనార్ మాట్లాడుతూ.. మహిళల భద్రతే తమ ప్రథమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. షీ టీమ్స్ ద్వారా మహిళల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. చిన్నారుల కోసం ఏడాది పొడవునా ఆపరేషన్ స్మైల్ నిర్వహిస్తున్నామని సీపీ గుర్తు చేశారు. ఐటీ కారిడార్‌లో 24 గంటల పాటు గస్తీ బృందాలు పని చేస్తున్నాయని తెలిపారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. 200 మందికి పైగా వాలంటీర్లు ట్రాఫిక్ పోలీసులకు సహకరిస్తున్నారని సీపీ చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో 6 లక్షల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. కేవలం హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీసు కమిషనరేట్ల పరిధిలో 3.5 లక్షల సీసీ కెమెరాలు ఉన్నాయని సజ్జనార్ తెలిపారు. క్యూ ఆర్టీ కోడ్స్‌తో క్యాబ్స్‌పై నిఘా పెట్టామని సజ్జనార్ తెలిపారు. ఐటీ రంగంలో హైదరాబాద్ దూసుకుపోతోంది. ఐటి మహిళ ఉద్యోగుల కోసం 11 షీ టీమ్స్, 20 షీ షటిల్స్ పనిచేస్తున్నాయి. మహిళల కోసం ఏర్పాటు చేసిన మార్గదర్శక్ బాగా ఉపయోగపడుతోంది. 200 మంది సాఫ్ట్ వేర్ ఐటీ ఉద్యోగులు ట్రాఫిక్ నియంత్రణలో వాలంటీర్లుగా పనిచేస్తున్నారు. నిర్భయ, మహిళల వేధింపులు, రేప్ కేసులతో పాటు మహిళల విషయంలో నమోదు చేసిన కేసుల్లో నిందితులకు తొందరగా శిక్షపడేలా చేస్తున్నాము' అని సజ్జనార్ వెల్లడించారు. ఐజీ స్వాతి లక్రా మాట్లాడుతూ.. మహిళా సాధికారత సదస్సు నిర్వహించడం అభినందనీయమన్నారు. మహిళలు, చిన్నారుల భద్రత కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. పోలీసులకు ప్రజల నుంచి ఎంతో మద్దతు లభిస్తోందన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు తమవంతు బాధ్యతగా నగదు ఇస్తున్నారని స్వాతి లక్రా తెలిపారు. చిన్నారుల కోసం ఏడాదిలో రెండుసార్లు ఆపరేషన్ స్మైల్, ముస్కాన్ నిర్వహిస్తున్నామని ఆమె చెప్పారు. దర్పన్ సాంకేతిక సాయంతో చిన్నారులను తల్లిదండ్రులకు అప్పగిస్తున్నామని స్వాతి లక్రా పేర్కొన్నారు. నటి సాయిపల్లవి మాట్లాడుతూ.. మహిళల భద్రత కోసం తెలంగాణ పోలీసులు ఎంతో కృషి చేస్తున్నారని ఆమె పేర్కొన్నారు. మహిళలకు హైదరాబాద్‌లో ఉన్న భద్రత మరెక్కడా లేదని సాయిపల్లవి స్పష్టం చేశారు. పోలీసుల భద్రతతో మహిళలు నిశ్చింతగా ఉంటున్నారని తెలిపారు. పోలీసులకు సహకరించడం మన బాధ్యత అని సాయి పల్లవి పేర్కొన్నారు.

తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం

కనీసం పదిమంది మృతి..
పలువురికి గాయాలు

చెన్నై,ఫిబ్రవరి20(ఆర్ఎన్ఎ): తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. తీవట్టిపత్తి దగ్గర... ఓ టూరిస్ట్ బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో... 10 మంది టూరిస్టులు చనిపోగా... మరో 20 మంది గాయాలతో ఆస్పత్రి పాలయ్యారు. వీళ్లంతా రాజస్థాన్‌కి యాత్రికులుగా విహార యాత్రకు వెళ్తున్నారు. బస్సును వేగంగా నడుపుతూ డ్రైవర్... ఓ రోడ్డు లోంచీ మరో రోడ్డులోకి వేగంగా బస్సును టర్న్ తిప్పాడు. దాంతో బస్సు అదుపుతప్పింది. అదే సమయంలో... బెంగళూరు నుంచీ కేరళ వెళ్తున్న ఓ ఓమ్నీ బస్సు... ఈ బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదం జరిగినప్పుడు బస్సులో ప్రయాణికులంతా నిద్రలో ఉండటంతో... ఏం జరుగుతుందో కూడా వాళ్లకు తెలియలేదు. ఇంతలోనే బస్సు బోల్తా కొట్టడతో... చాలా మంది అక్కడికక్కడే చనిపోయారు. మిగతావారిని ఆస్పత్రికి తరలించగా... కొంత మంది ఆస్పత్రిలో ప్రాణాలు విడిచారు.తమిళనాడులో వోల్వో బస్సు, లారీ ఢీ కొన్న ప్రమాదంలో 10 మంది చనిపోగా... చాలా మంది గాయాలపాలయ్యారు. మృతుల సంఖ్య మరింత పెరగవచ్చని స్థానికులు అంటున్నారు. గాయపడిన వారికి స్థానిక ఆస్పత్రుల్లో చికిత్స అందిస్తున్నారు. ఈ వోల్వో బస్సు బెంగళూరు నుంచీ ఎర్నాకుళం వెళ్తోంది. మృతులు ఎవరన్నదీ డాక్టర్లు ఇంకా గుర్తించలేదు. మృతుల్లో కేరళ ప్రయాణికులు కూడా ఉండొచ్చని తెలుస్తోంది.

తమిళనాడు తిరుప్పూరు సమీపంలో కంటెయినర్ బస్సును ఢీకొన్న దృశ్యం

ఉద్యమస్ఫూర్తితో పల్లెల ప్రగతికి పనిచేయాలి: మంత్రి జగదీష్‌రెడ్డి

సూర్యాపేట, ఫిబ్రవరి 20 : తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలా పల్లెల్లో ప్రగతికి అదే స్ఫూర్తితో పనిచేయాలని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో పంచాయతీరాజ్ సమ్మేళనంను నేడు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మంత్రి జగదీష్ రెడ్డి, ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్సీ తేరా చిన్నపరెడ్డి, ఎమ్మెల్యేలు గాదరి కిశోర్, బొల్లం మల్లయ్య యాదవ్, శానంపూడి సైదిరెడ్డి, జడ్పీ చైర్మన్ దీపికా యుగంధర్ రావు, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి జగదీష్ రెడ్డి మాట్లాడుతూ... పల్లె ప్రగతిలో ప్రజల భాగస్వామ్యం పెరిగిందన్నారు. గ్రామీణాభివృద్ధి ప్రణాళికలకు రూపం ఇచ్చినా శిల్పి సీఎం కేసీఆర్ అన్నారు. సీఎం కేసీఆర్ ఆశించిన పద్ధతిలో పల్లెలు ప్రగతిలో పరుగులు పెట్టాలన్నారు. కష్టపడి పనిచేసే ప్రజాప్రతినిధుల మీద ప్రజల్లో విశ్వసనీయత పెరుగుతుందన్నారు. పర్యావరణ సమస్య మానవాళి మనుగడను ప్రశ్నార్థకంగా మార్చిందని.. ఇటువంటి భయానక సమస్యను అధిగమించేందుకు పల్లెప్రగతి తోడ్పడాలన్నారు. భవిష్యత్ తరాలకు ఆక్సిజన్ అందించేలా పల్లె ప్రగతి ఉండాలని సూచించారు. ప్రజలను బెంబేలిస్తున్న సమస్య చెత్త డంపింగ్. ఈ సమస్యకు పరిష్కారమే ప్రతి గ్రామంలో డంపింగ్ యార్డ్‌ల ఏర్పాటు అన్నారు. అదేవిధంగా ప్రతీ గ్రామం శ్మశాన వాటికలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్‌లోని శ్మశాన వాటిక రాష్ట్రానికే రోల్ మోడల్‌గా మారిందన్నారు. అభివృద్ధి రుచి తెలిసిన గ్రామాలు మరింత అభివృద్ధికి పోటీ పడుతున్నాయని మంత్రి పేర్కొన్నారు.

గ్రామాల వారీగా ప్రత్యేక బడ్జెట్ రూపొందించుకోవాలి: మంత్రి సబితా

రంగారెడ్డి , ఫిబ్రవరి 20: మరో విడత పల్లె ప్రగతి కార్యక్రమానికి ప్రజాప్రతినిదులు, అధికారులు సన్నద్ధం కావాలని అదేవిధంగా గ్రామాలవారీగా ప్రత్యేక బడ్జెట్ రూపొందించుకోవాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. పంచాయతీ సమ్మేళనంలో భాగంగా రంగారెడ్డి జిల్లా శంషాబాద్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సంధ్భంగా మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ... ఈ నెల 23 నుంచి ప్రారంభించనున్న పల్లె ప్రగతి కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పూర్తి స్థాయిలో పాల్గొనాలన్నారు. పల్లె ప్రగతి కార్యక్రమం నిర్వహణ, విధులపై స్థానిక ప్రజాప్రతినిధులకు మంత్రి వివరించారు. రంగారెడ్డి జిల్లాలోని ప్రతీ గ్రామం ఆదర్శ గ్రామంగా, స్వచ్ఛ, పచ్చని గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. నూతన పంచాయతీ రాజ్ చట్టం రూపొందించడంతో పాటు గ్రామాల అభివృద్ధికి సంబంధించి అధికారులకు, ప్రజాప్రతినిధులకు ప్రభుత్వం నిధులు, విధులు కేటాయించిందని తెలిపారు. గ్రామాలను ఆదర్శంగా తిర్చిదిద్దాలనే ప్రధాన ఉద్దేశంతో సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా పల్లె ప్రగతి కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామాలు సమగ్రంగా అభివృద్ధి చెందేలా కలసికట్టుగా పని చేయాలని సూచించారు. నిరక్షరాస్యులందరిని అక్షరాస్యులుగా చేసే భాధ్యత చేపట్టాల న్నారు. గ్రామాల వారీగా బడ్జెట్ ను రూపొందించుకోవాలన్నారు. ప్రతీ గ్రామానికి ఒక కార్యదర్శిని నియమించిన ఘనత సీఎం కేసీఆర్ కే దక్కుందన్నారు. పల్లెలకు అవసరమైన సదుపాయాల కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ట్రాక్టర్ల కొనుగోలు పూర్తి చేయాలని, వైకుంఠ ధామాలు తప్పనిసరిగా నిర్మించాలని ఆదేశించారు.

చరిత్రలో నేటినిజం

కం॥ అభవుని పూజించుచు-పుట
సభలను రంజించి-అర్థశాస్త్రజ్ఞునిగా
విభవముతో చెలఁగుండెడి
'అభిజిత్తు' చెనర్జి' సతత మాదర్శంబౌ!!

(ఫిబ్రవరి 21 అభిజిత్ బెనర్జీ పుట్టిన రోజు)

-రాధశ్రీ
సెల్: 9494481210

శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానము, వేములవాడ.

రాజన్న సిరిసిల్ల జిల్లా - 505 302, తెలంగాణ రాష్ట్రం.

మహాశివరాత్రి జాతర మహోత్సవ ఆహ్వానము

website : www.vemulawadatemple.org

తేది: 21-02-2020 శుక్రవారము

e-mail : eo-vemulawada@telangana.gov.in

తేది: 20-02-2020 గురువారము నుండి తేది: 22-02-2020 శనివారము వరకు

తేది : 21-02-2020 శుక్రవారము మహాశివరాత్రి పర్వదినము రోజున ఉ॥ 8-00 గం॥లకు రాష్ట్ర ప్రభుత్వం తరుపున పట్టు వస్త్రముల సమర్పణ
సా॥ 6-05 ని॥లకు మహాలింగార్చన మరియు రాత్రి 11-35 ని॥లకు లింగోద్భవ కాలమందు మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకము

తేది : 20-02-2020 గురువారము రోజున రాత్రి 9-00 గం॥లకు నిశిపూజ అనంతరం భక్తుల సౌకర్యార్థం నిరంతర దర్శనము కొనసాగించబడును.
తేది : 21-02-2020 శుక్రవారము రోజున లఘు దర్శనము మరియు కోడెమొక్కుబడి కొనసాగించబడును.

కార్యనిర్వహణాధికారి (I.A.C.)
శ్రీ రాజ రాజేశ్వరస్వామి దేవస్థానము, వేములవాడ.

నేటినిజం
శుక్రవారం 21-2-2020

సర్వవేదానుసారం - 'ఓం'కారనాదం..

వేదాలు ఉపనిషత్తులు ఓంకారాన్ని తపస్సుగా,ధ్యానంగా ఘోషిస్తున్నాయి. ఓంకారాన్ని సాధన చేయండని ప్రేరేపిస్తున్నాయి. ఓం స్మర, ఓం స్మర ఓంకారాన్ని స్మరించమని యజుర్వేదమాదేశించింది. ఓంకారాన్ని స్మరించడం వలన, కీర్తించడంవలన, జపించడం వలన, శ్రవణం చేయడం వల్ల మానవుడు పరమాత్మను పొంది తీరుతాడని అందువల్ల ఓంకార పరాయణువు కమ్మని శాస్త్రాలు శాసిస్తున్నాయి. ప్రణవాన్ని ఉపాసించడం వలన పరమాత్మ సాక్షాత్కరిస్తుందని వేదాలు చెబుతున్నాయి. ఓంకారోపాసన మృత్యు విముక్త చేసి పరమేశ్వర సాక్షాత్కారం కలిగిస్తుంది. ఓంకారోపాసకునికి ఐహికముష్మికములన్నీ సిద్ధిస్తున్నాయి. ఓంకారోపాసన వలన పరమానందాన్ని పొందవచ్చు. ఓంకారోపాసకుని ప్రతి అవయవంలోనూ శక్తి నిక్షేపముంది కాబట్టి శత్రువులెవరు అతనిని ఎదరించడానికి సాహసించరు. ఒకవేళ సాహసంతో ఎదిరిస్తే నశించి తీరుతారు. ఓ మహాత్మా! జీవితమంతా ఓంకారాన్ని ధ్యానించువారే లోకాన్ని చెందుతున్నారని తెలియచెప్పవలసిందని సత్యకాముడు పిప్పలాద మహర్షిని అడిగాడు. అపుడు మహర్షి ఓ సత్యకామా! ఈ ఓంకారము పరబ్రహ్మము. అపరబ్రహ్మము ఇదే! దీని తత్వాన్ని తెలుసుకున్నవారు పరమాత్మను పొందుతున్నారు. ఒక మాత్ర కాలంలోనే ఉచ్చరించే ఓంకారాన్ని ధ్యానించే వారు అచిరకాలంలో భూతలంలో కనిపిస్తున్నారు. ఋగ్వేదం లోని ఋక్కులు అతన్ని మానవజన్మలోనే పుట్టిస్తుంటాయి. అతడు బ్రహ్మ చర్యాన్ని పాటించడం వలన మహామహిమ కలవాడగుచున్నాడు.

రెండు మాత్రల కాలంలో ఓంకారాన్ని ధ్యానించునట్లైన చంద్రలోకాన్ని చేరుతున్నాడు. యజుర్వేద మంత్రాలు వారినక్కడికే కొనిపోతున్నాయి. వారక్కడ సమస్త భోగాలను అనుభవించి మరల భూలోకాన్ని చేరుతున్నాడు. మూడు మాత్రల కాలంలో ఉచ్చరించే ఓంకార పరమేశ్వరుని నిరంతరం ధ్యానించేవారు తోజోమయమయిన సూర్యలోకాన్ని చేరుతున్నారు. కుబుసాన్ని విడచిన పామువలె సమస్త పాప విముక్తులై సామవేద సాతు శాస్త్రాలతో బ్రహ్మ లోకాన్ని పొందుతున్నాడు. ఇలా ఓంకారంలోని మూడు మాత్రలు పరస్పరం సంబంధాన్ని కలిగి ఉంటాయి. ఇటువంటి ఓంకారాన్ని దృఢసంకల్పంతో ధ్యానించినంతనే పరమేశ్వరుణ్ణి చేరుతున్నారు.ఓంకారం నుండి మంగళ ప్రదనాదం వెలువడుతుంటుంది. ఓంకారం శాశ్వత బ్రహ్మము. దాని ప్రభావాన్ని స్పష్టపరిచేది ప్రపంచమే! ఓంకారంతో సామగానం చేస్తున్నారు. ఓంకారాన్ని ఉచ్చరిస్తూ దర్శనాది శాస్త్రాలు చదువుతున్నారు. ఓం అంటూ అధ్వంస్యపుప్రతిగిర మంత్రాన్ని ప్రారంభిస్తున్నాడు. ఓం అనే ప్రేషతో బ్రహ్మ యజ్ఞాన్ని ప్రారంభించడానికి అనుమతి ఇస్తున్నాడు. ఓంకారాన్ని ఉచ్చరిస్తూ వేదాధ్యయాన్ని ఆరంభించే బ్రాహ్మణుడు ఓంకార ప్రభావంతో పరబ్రహ్మను పొందుతున్నాడని, చేరుకోగలుగుతున్నాడని తైత్తిరీయ శీక్షావల్లి చెబుతూంది. పవిత్రాత్మలయిన ఓంకార సంబంధమయిన జ్ఞానమునకు విరుద్ధాలైన విజ్ఞానమంతా తిరస్కరించదగినదే అన్నాడు శ్రీరామతీర్థస్వామివారు. ఇది వాఙ్మయమే కాకుండా ఎందరో మహాత్ములను సందర్భానుసారంగా సృష్టించగలిగినది..

శివుడు అభిషేక ప్రియుడు

హైదరాబాద్, ఫిబ్రవరి 20:శివుడు అభిషేక ప్రియుడు. అలాగే బిల్వదళ ప్రియుడు. అందుకే అభిషేకాలు, బిల్వార్చనలను శివరాత్రినాడు విధిగా చేస్తుంటారు. తెలిసైనా, తెలియకైనా కొన్ని నీళ్ళు శివలింగం మీద పోసి మరికొన్ని మారేడు దళాలు ఆ శివలింగంమీద పెడితే బోళాశంకరుడు పరవశించి అలా చేసినవారిని అనుగ్రహించిన కథలు ఎన్నెన్నో మన పురాణాల్లో కనిపిస్తున్నాయి. అందుకే భక్తులు శివరాత్రి రోజు అభిషేకం చేసి జాగారం చేయడం ఆనవాయితీగా వస్తోంది. శివుడు మిగతా దేవతలతో పోలిస్తే సులువగా అనుగ్రహం ఇస్తాడని నమ్మిక. శివనామంతో సర్వపాపాలు హరించుకు పోతాయని అంటారు. మనదేశంలో అనే శైవాలయాలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి. కాశితో పాటు జ్యోతిర్లింగ క్షేత్రాల్లో ప్రత్యేక పూజలు జరుపుతారు. ఈశాన సంహిత ప్రకారం శివుడు ఓసారి అర్ధరాత్రి సమయంలో తేజోలింగంగా ఆవిర్భవించాడు. అదే లింగోద్భవకాలం. అలా పరమశివుడు లింగాకారంలో పుట్టినరోజు కావడంచేత శివుడికి ఇష్టమైన ఆ రోజున శివపూజ జరపడం మంచిదని శైవం చెబుతోంది. వినాయక చవితి, శ్రీరామనవమి లాంటి పండుగలలో దేవుళ్లను పగటిపూట పూజిస్తారు. శివరాత్రినాడు శివుడిని రాత్రిపూట మాత్రమే పూజించడం, మిగిలిన పండుగలలా పంచభక్ష్య పరమాన్నాలతో కాక ఉపవాస దీక్షతో శివరాత్రి పండుగను జరుపుకోవడం ఓ విశేషం. త్రిమూర్తులలో మూడోవాడు శివుడు. బ్రహ్మ సృష్టికర్త. విష్ణువు సంరక్షకుడు. శివుడు లయకారకుడు. ఇరాధకులకు మహాశిరాత్రి పర్వదినం. ఉపవాసం ఈ పండగ ప్రత్యేకత. శివుడు భోళాశంకరుడు. అడకుండానే వరాలిచ్చే దేవుడు. శివరాత్రి రోజు ఉపవాసం ఉండి రాత్రి అభిషేకించి జాగారం చేస్తే ముక్తి లభిస్తుందని ఆర్యోక్తి. అందుకే శివరాత్రి జాగారాలకు ప్రాధాన్యం ఉంది. మహాశివరాత్రి మాఘమాసం కృష్ణపక్షంలో అర్ధరాత్రి ఉండే చతుర్దశి తిథినాడు వస్తుంది. చతుర్దశి తిథి శివుడికి ఎంతో ప్రీతికరమైంది. అందులోనూ కృష్ణచతుర్దశి అంటే అమావాస్యకు ముందు వచ్చే చతుర్దశి తిథి మరీ ప్రీతికరమైంది. ఆ కారణంగానే ప్రతి మాసంలోనూ వచ్చే కృష్ణచతుర్దశి తిథులు మహాశివరాత్రులుగా ఉంటాయి. సంవత్సరం లోని పన్నెండు శివరాత్రులలో మాఘమాసంలో వచ్చే శివరాత్రి శివుడికి బాగా ఇష్టమైంది కాబట్టి దాన్ని మహాశివరాత్రి అని అంటారు. మహాశివరాత్రి ప్రతాచరణను గురించి లింగపురాణం పేర్కొంటోంది. వ్రత ఉద్యాపన గురించి స్కందపురాణంలో వివరంగా ఉంది. శివరాత్రి నాడు పగలంతా ఉపవాసం, రాత్రిపూట లింగార్చన, జాగరణం చేస్తారు. లింగార్చన తరువాత పార్వతీ పరమేశ్వరుల కల్యాణం చేయడం కూడా ఓ అలవాటుగా వస్తోంది. శివరాత్రులు అయిదు రకాలు. అవి.. నిత్య శివరాత్రి, పక్ష శివరాత్రి, మాస శివరాత్రి, మహాశివరాత్రి, యోగశివరాత్రి. నిత్యశివరాత్రి అంటే ప్రతిరోజూ రాత్రిపూట చేసే శివారాధన. పక్ష శివరాత్రి అంటే ప్రతి పదిహేను రోజులకొకసారి శివార్చన కోసం నిర్దేశిరచిన రాత్రి. మాసశివరాత్రి అంటే ప్రతి మాసంలోనూ శివపూజకు ఉద్దేశించిన రాత్రి. మిగతా శివరాత్రులు ఏవి కుదిరినా కుదరకపోయినా ఏడాదికొకసారి వచ్చే మహాశివరాత్రినాడు శివపూజ చేయడం పుణ్యప్రదం. యోగి అయినవాడు తన యోగబలం చేత యోగనిద్రలోకి వెళ్లే రాత్రిని యోగశివరాత్రి అని అంటారు. సాధారణంగా రాత్రిపూట దేవీపూజను, పగటిపూట దేవపూజను చేయడం ఒక ఆచారంగా ఉంటుంది. కానీ శివరాత్రి విషయంలో మాత్రం ఇది భిన్నంగా కనిపిస్తుంది. శివరాత్రి రోజున రాత్రిపూటే శివపూజ జరుగుతుంది. ఇలా శివ ఆరాధన రాత్రిపూట జరగడానికి ఓ కారణం కూడా ఉంది. పూర్వం ఓసారి ప్రళయం వచ్చినప్పుడు అంతా కటికచీకటిగా మారిపోయింది. ఆ సమయంలో లోక కల్యాణం కోసం పార్వతీదేవి శివుడిని గురించి తపస్సు చేసింది. ఆనాటి పార్వతి తపస్సు మెచ్చిన శివుడు ఆ చీకటిని పోగొట్టి మళ్లీ మామూలుగా రాత్రి, పగలు ఏర్పడేలా చేశాడు. దాంతో జీవులన్నీ మళ్లీ ఆనందించాయి. తాను చేసినట్లుగా అంత రాత్రివేళ శివుడిని గురించి పూజలు చేసినవారికి సర్వసుఖాలు కలిగేలా అనుగ్రహించమని పార్వతీదేవి శివుడిని ప్రార్థించింది. శివుడు అందుకు అంగీకరించాడు. పార్వతి చేసిన శివపూజకు గుర్తుగా ఆనాటి నుంచి మహాశివరాత్రి పూజా పర్వదినం ఏర్పడింది. శివరాత్రినాటి లింగోద్భవ సమయంలో చేసే అభిషేకాలలో కూడా కొన్ని పద్ధతులున్నాయి. రాత్రి జాగరణం చేస్తూ నాలుగు జాములలోనూ నాలుగు సార్లు నాలుగు రకాలుగా అభిషేకాలు చేస్తుంటారు. మొదటి జాములో పాలతో అభిషేకించి, పద్మాలతో పూజచేసి పెసరపప్పు, బియ్యం కలిపి పులగం వండి శివుడికి నైవేద్యం పెడతారు. రుగ్వేద మంత్ర పఠనం జరుపుతారు. రెండో జాములో పెరుగుతో అభిషేకం, తులసీ దళార్చనచేసి, పాయసం నైవేద్యంపెట్టి యజుర్వేద మంత్రాలను చదువుతారు. మూడోజాములో నేతితో అభిషేకించి, మారేడు దళాలతో అర్చించి, నువ్వుల పొడి కలిపిన తిను బండారాలను నివేదిస్తారు. సామవేద మంత్రపఠన చేస్తారు. నాలుగో జాములో తేనెతో అభిషేకంచేసి నల్ల కలువలతో పూజించి అన్నం నివేదిస్తారు. అథర్వణ వేద మంత్రాలను చదువుతారు. ఇలా అభిషేకాలు చేసే శక్తిలేనివారు అభిషేకం చేసేటప్పుడు శివదర్శనం చేసుకున్నా పుణ్యమేనంటారు. నాలుగో జాము ముగిశాక ఉదయంపూట శివుడిని ఊరేగిస్తారు. ఇలా ఊరేగించడం వెనుక ఓ సామాజిక అంతరార్థం ఉంది. ఎవరైనా ఏ కారణం చేతనైనా ఆలయాలకు వెళ్ళి శివదర్శనం చేసుకోలేకపోతే వారికి ఆ ఊరేగింపును చూసి పుణ్యం పొందే భాగ్యం కలుగుతుంది.

శివరాత్రికి ముస్తాబైన కాళేశ్వరం

కాళేశ్వరుణ్ని దర్శిస్తే ముక్తి తథ్యం

జయశంకర్ భూపాలపల్లి,ఫిబ్రవరి20(ఆర్ఎన్ఎ): త్రిలింగ క్షేత్రాల్లో ఒకటిగా పేరొందిన శైవ పుణ్యక్షేత్రం కాళేశ్వరం. కాశీలో మరణిస్తే ముక్తి.. గోదావరి ఒడ్డున ఉన్న కాళేశ్వరుణ్ని దర్శిస్తే ముక్తి ... అనే నానుడి ఉంది. మహదేవపూర్ మండలంలో ఉన్న ఈ పుణ్య క్షేత్రానికి తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌ల నుంచి భక్తులు తరలివస్తారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఇక్కడ ఒకే పానపట్టంపై రెండు లింగాలు ఉండటం విశేషం. గోదావరి, ప్రాణహిత, సరస్వతీ నదుల త్రివేణి సంగమంగానూ దీనికి గుర్తింపు ఉంది. యముడు శివుడు ఒకే పానమట్టంపై ఇక్కడ పూజలు అందు కుంటారు. ఇద్దరమూ భక్తులకు ఆరాధ్యులమవుతామని పరమేష్ఠి యమధర్మరాజుకు చెప్పాడట. అలా ఇది కాళేశ్వరమయింది. భక్తులకు ఎలాంటి అసౌర్యాలు కలగనీయకుండా అధికారులు పనుల్లో నిమగ్నమయ్యారు. ఏ శాఖ నిర్వర్తించాల్సిన విధులు ఆ శాఖ ఆధ్వర్యంలో కొనసాగేలా జయశంకర్ జిల్లా సంయుక్త పాలనాధికారి అమయ్‌కుమార్ దిశా నిర్దేశం చేశారు. తెలంగాణ, ఆంధ్ర, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి ఈసారి వచ్చే భక్తుల సంఖ్య రెండు లక్షలు దాటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తులకు ప్రసాదం విషయంలో కొరత లేకుండా భారీ సంఖ్యలో లడ్డూ, పులిహోర ప్రసాదాల తయారీని చేపట్టారు. మహిళలు, పురుషులు ప్రత్యేకంగా ప్రసాదాన్ని కొనుగోలు చేసే విధంగా కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. శివరాత్రి ఉత్సవాన్ని పురస్కరించుకొని 13న ఉదయం నాలుగు గంటలకు శివపార్వతుల కల్యాణం జరుగుతుంది. ఈ వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే పుట్టమధు దంపతులతో పాటు స్థానిక ప్రజాప్రతినిదులు పాల్గొంటారు. గత ఉత్సవాల్లో లేని విధంగా మొదటి సారిగా ముత్యాల తలంబ్రాలను భక్తులకు అందజేస్తారు. శివరాత్రి సందర్భంగా అధికంగా భక్తులు అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహిస్తారు. స్థానిక బ్రహ్మణోత్తములను రెండు రోజుల పాటు విధుల్లోకి తీసుకోనున్నారు. శివరాత్రికి అనేక మంది భక్తులు జాగారణ ఉంటారు. ఈ నేపథ్యంలో హరికథ, కూచిపూడి నృత్యం, భజన సంకీర్తనలు తెల్లవారు జాము వరకు ఉంటాయి. ప్రధాన ఆలయంతో పాటు అనుబంధ ఆలయాలను విద్యుత్తుతో అలంకరిస్తున్నారు. పూర్వపు ఆనవాయితీని పురస్కరించుకొని స్థానిక భక్తుల కోసం ఉదయం 6 నుంచి 8 గంటల వరకు ప్రత్యేకంగా గర్భగుడిలోకి ప్రవేశించేందుకు అవకాశం కల్పిస్తున్నారు.

వేములవాడకు హెలికాప్టర్ సేవలు ప్రారంభం.. ప్యాకేజీ వివరాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (నేటినిజం ప్రతినిధి): మహాశివరాత్రిని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వేములవాడకు హెలికాప్టర్ సేవలను ప్రారంభించింది. తెలంగాణ రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ తెలంగాణ స్టేట్ ఏవియేషన్ కార్పొరేషన్ సహకారంతో ఈ సేవలను ప్రారంభించింది. బేగంపేట విమానాశ్రయంలో మంత్రి శ్రీనివాస్ గౌడ్ హెలికాప్టర్ సేవలు ప్రారంభించారు. నేటి నుంచి ఈ నెల 23వ తేదీ వరకు హెలికాప్టర్ సేవలు అందుబాటులో ఉండనున్నాయి. హెలికాప్టర్ సేవలు మొత్తం మూడు రకాల ప్యాకేజీలుగా ఉన్నాయి. ప్యాకేజీ-1లో భాగంగా వేములవాల నుంచి వ్యూపాయింట్‌కు 7 నిమిషాల రైడ్‌కు టికెట్ ధర రూ.3 వేలు. ప్యాకేజీ-2లో వేములవాడ మిడ్‌మానేరు పరిసర ప్రాంతాలు తిలకించేందుకు రూ.5,500. కనీసం ఆరుగురు వ్యక్తులు ఉండాలి. 16 నిమిషాల విహంగ వీక్షణం. ప్యాకేజీ-3లో హైదరాబాద్ నుంచి వేములవాడకు తిరిగి హైదరాబాద్‌కు. టికెట్ ధర రూ. 30 వేలు. కనీసం ఐదుగురు వ్యక్తులు ఉండాలి. బుకింగ్ కొరకు 09400399999, 09880505905, 07994481767, 09544444693 నెంబర్లలో సంప్రదించవచ్చు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. మంత్రి కేటీఆర్ సూచనతో వేములవాడకు హెలికాప్టర్ సేవలు ప్రారంభించినట్లు తెలిపారు. రాష్ట్రంలో ఆలయ పర్యాటకాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. మిడ్‌మానేరును పర్యాటక హబ్‌గా చేసేందుకు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. భవిష్యత్‌లో ప్రధానాలయాలు, పర్యాటక ప్రాంతాలకు హెలికాప్టర్ సేవలు కొనసాగించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా మిడ్‌మానేరు నుంచి సిరిసిల్లకు బోటు సర్వీసులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్ నుంచి వేములవాడకు పర్యాటక ఏసీ బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి చెప్పారు.

కొమురవెల్లి మల్లన్నకు పెద్దపట్నం

-శివరాత్రి వేడుకలకు సర్వం సిద్ధం

సిద్దిపేట,ఫిబ్రవరి20(ఆర్ఎన్ఎ): కొమురవెల్లి మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మహాశివరాత్రి నాడు ఆలయం తరపున నిర్వహించే 'పెద్దపట్నం' ప్రత్యేక ఆకర్షణ కానుంది. ఈ వైవిధ్య పూజా కార్యక్రమం తెలంగాణకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.దీనికోసం భారీగా భక్తులు తరలిరానున్నారు. పట్నం' అంటే స్వామికి కల్యాణం చేయడం. హిందూ సంప్రదాయం ప్రకారం పెళ్లికి ముందు 'పోలు' (బియ్యంతో పోయడం) కార్యక్రమాన్ని కొమురవెల్లిలో వీరశైవ ఆగమశాస్త్ర ప్రకారం నిర్వహిస్తారు. ఆలయం వద్ద 'పట్నం' వేయడమంటే స్వామికి కల్యాణం చేసినట్లుగా భక్తులు భావిస్తారు. శివరాత్రి నాటి అర్ధరాత్రి పంచవర్ణాలతో పెద్దపట్నం వేస్తారు. దాదాపు 50 గజాల వైశాల్యంతో వేసే ఈ ముగ్గును వివిధ ఆకారాలతో 42 వరుసలతో వేస్తారు. 3 గంటల పాటు 20 మంది ఒగ్గు పూజారులు, కళాకారులు దీనికోసం శ్రమిస్తారు. క్వింటాళ్ల కొద్దీ పసుపు, కుంకుమ, తంగేడు ఆకులతో తయారైన చూర్ణం, బియ్యపు పిండిని వినియోగిస్తారు. పట్నం వేయడం పూర్తయ్యాక ఆలయ అర్చకులు స్వామి ఉత్సవ విగ్రహాలను వూరేగింపుగా తీసుకొచ్చి పెద్దపట్నం వద్ద నిలిపి, పూజలు నిర్వహిస్తారు. అక్కడే స్వామి కల్యాణం నిర్వహిస్తారు. గతంలో ఆలయం ముందు గంగరేణి చెట్టు వద్ద పట్నం వేసేవారు. రెండేళ్లుగా తోటబావి వద్ద నిర్మించిన కల్యాణ వేదికపై ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అందంగా, ఆకర్షణీయంగా పంచ రంగుల చూర్ణం (పొడి)తో ముగ్గు (పట్నం) పరుస్తారు.మొదట ఉత్సవ విగ్రహాలతో అర్చకులు పెద్దపట్నం దాటుతారు. ఆ సమయంలో పసుపు పులుముకున్న పరిసరాలన్నీ శుభమస్తు అని దీవించినట్లుగా బంగారువర్ణాన్ని అద్దుకుంటాయి.

శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన హన్మకొండ

-వేయిస్తంభాల గుడిలో ప్రత్యేక పూజలు

వరంగల్,ఫిబ్రవరి20(నేటినిజం ప్రతినిది): వేయిస్తంభాల గుడిలో శివరాత్రి వేళ పాంచాహ్నిక దీక్షతో ఉత్సవాలు కోలాహలంగా జరుగుతాయి. రుద్రేశ్వరి, రుద్రేశ్వరులకు మంగళస్నానాలు చేయించి వధూవరులుగా చక్కగా అలంకరిస్తారు. మొదటి రోజే లోక కల్యాణార్థం మహా చండీ హోమం చేస్తామని ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ పేర్కొన్నారు. ఉత్సవాల వేళ రోజూ సాయంత్రం కూచిపూడి నృత్యం, హరికథ, పురాణ కాలక్షేపం తదితర సాంస్కృతిక కార్యక్రమాలతో ఆలయం ప్రాంగణం కళకళలాడుతుంది. శుక్రవారం ఉదయం మూడింటికే స్వామికి సుప్రభాత సేవ, మంగళవాయిద్య సేవ, మహాగణపతికి నవరసాభిషేకం నిర్వహించిన తర్వాత రుద్రేశ్వరుడికి మహన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, సామూహిక రుద్రాభిషేకం చేస్తారు. సాయంత్రం ఆరింటికి శివపార్వతుల కల్యాణం వైభవోపేతంగా నిర్వహిస్తారు. రాత్రి 12 గంటలకు లింగోద్భవ కాలంలో విశేషంగా మహారుద్రాభిషేకం ఉంటుంది. శివరాత్రి మర్నాడు స్వామికి నాకబలి, సదస్యం కార్యక్రమాలు ఉంటాయి. పూర్ణాహుతి తో ఉత్సవాలు ముగుస్తాయి. ప్రధానంగా పండుగ రోజు లక్షలాదిగా భక్తులు ఆలయానికి పోటెత్తుతారు. ఉత్సవాల వేళ చుట్టూ మిరుమిట్లు గొలిపే విద్యుత్తు దీపాల అలంకరణ, పుష్పాలంకరణతో ఆలయం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటుంది. అలనాటి దేవాలయాల చరిత్ర, భక్తి భావానికి పవిత్రకు నిలయాలు. 1969 సంవత్సరం నుండి ధూపదీప నైవేద్యాలు, నిత్యపూజలు రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయని ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్ర శర్మ చెప్పారు. దేవాలయంలో శివునికి నిత్యపూజలతోపాటు ప్రత్యేక తిథును అనుసరిస్తూ పర్వదినాల్లో పూజలు నిర్వహించడం ఆనవాయితీ. తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన్నిపురస్కరించుకొని గణపతిపూజ, లోక కళ్యాణార్థం హన్యసపూర్వక ఏకాదశి రుద్రాభిషేకం నిర్వహిస్తారు. సాయంత్రంత కవిసమ్మేళనం, పంచాంగశ్రవణం జరుగుతుంది. శ్రీరామ నవమిని పురస్కరించుకొని ఉత్సవాలు జరుగుతాయి. శ్రీరాముని కళ్యాణం అంగరంగ వైభంగ సాగుతుంది. ఇక తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితి.

కాకతీయ కళావైభవం వేయిస్తంభాల గుడి

-నేటికీ వన్నె తగ్గని కళా వైభవం

వరంగల్,ఫిబ్రవరి20(నేటినిజం ప్రతినిది): కాకతీయుల కళావైభవానికి, భక్తి పారవర్యానికి నిలయం వరంగల్ లోని వేయి స్తంభాల దేవాలయం. వేయి స్థంబాల పేరుతో నిర్మితమైన ఆలయ వైభవం నేటికి కొనసాగుతుంది. ఈ దేవాలయంలో శివలింగాన్ని రుద్రేశ్వర స్వామిగా కొలుస్తారు. అంతేకాదు వేయిస్థంభాల దేవాలయానికి మరో విశిష్టత ఉంది. భక్తి భావంతో పాటు ఆలయంలో శిల్పకల ఉట్టిపడుతుంది. వేయిస్తంభాల దేవాలయాన్ని త్రికుటాల యంగా పిలుస్తారు. ఇక్కడ శివునితోపాటు విష్ణుమూర్తి, సూర్య భగవానుడు కొలుపుదీరాడు. 850 ఏళ్ల ఘనచరిత కలిగి దేశంలోనే ప్రముఖ పర్యటక ప్రాంతాల్లో ఒకటిగా గుర్తింపు పొందిందీ ఆలయం. రుద్రేశ్వరాల యంగానూ దీనికి పేరుంది. క్రీ.శ. 1163లో కాకతీయుల రాజు రుద్రదేవుడి హయాంలో వేయిస్తంభాల ఆలయాన్ని నిర్మించారు. వేయి స్తంభాలతో ఆలయంతో పాటు ఆలయానికి ఎదురుగా కళ్యాణ మండపాన్ని అత్యంత సుందరనీగా తీర్చిదిద్దారు.

కాకతీయు నిర్మాణం పూర్తి కావడానికి 80 సంవత్సరాలు పట్టినట్లు చరిత్ర చెబుతుంది. కాకతీయులు శివభక్తులు కావడంతో వేయిస్తంభాల దేవాలయంలో భారీ ఆకారంలో ఉన్న శివలింగాన్ని ప్రతిష్టించారు. శైవ క్షేత్రాల్లో సాదారణంగా శివునికి, శివలింగానికి ఎదురగా నందీశ్వరుడు ఉంటారు. కానీ వేయిస్తంభాల దేవాలయంలో బిన్నంగా సూర్యభగవానుడు కొలువై ఉంటారు. ఈ ఆలయం మరో విశిష్టతను కల్గిఉంది. హరి హర వేదాలు రాకుండా ఆలయానికి త్రికూటాలయంగా నామకరణం చేసి శివునికి ఎడమై వైపున విష్ణుమూర్తిని, ఎదురుగా సూర్యభగవానున్ని ప్రతిష్టించారు. విష్ణుమూర్తి కి నిత్యకళ్యాణం మచ్చతోరణం అన్నట్లు నిత్యపూజలు జరుగుతాయి కాబట్టి విష్ణుమూర్తికి ఎదురుగా నందీశ్వరుడి విగ్రహం విగ్రహం వెనకాల కళ్యాణమండపం నిర్మించారు రుద్రదేవ మహారాజు. ఇక్కడ శివునితోపాటు విష్ణుమూర్తి, సూర్యభగవానుడు నిత్య పూజులు అందుకోనేవారు.ఆలయంలోని శివలింగంపై ఉదయం 5 గంటల 30 నిమిషాలు 6 గంటల మధ్యంలో సూర్యకిరణాలు నేరుగా పడతుంటాయి.

రోడ్డు ప్రమాదాలపై వాహనదారుల్లో ఆందోళన

మహబూబ్‌నగర్,ఫిబ్రవరి 20(ఆర్ఎన్ఎ): నాగర్‌కర్నూల్ నుంచి జడ్చర్ల వెళ్లే ప్రధాన రహదారిలో ఇంద్రకల్ గ్రామ సమీపంలో ప్రధాన రహదారిపై మట్టికుప్ప పోయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రహదారిపై తరచూ ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నా ఆర్ అండ్ బీ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదంటూ వాహనదారుల తోపాటు పరిసర గ్రామాల ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత వారం వ్యవధిలో ఇదే రహదారి ఇంద్రకల్ సమీపంలోనే రెండు ప్రమాదాలు జరిగి ఇద్దరు మృతి చెంది, ఒకరు తీవ్ర గాయాలపాలైన ఘటన చోటు చేసుకున్నా అధికారుల్లో ఏమాత్రం చలనం లేదంటూ ఆందోళన చెందుతున్నారు. అదేవిధంగా రహదారి మొత్తం మలుపులతో ఉండడంతో ప్రమాదాల తీవ్రతకు మరింత దోహదపడుతున్నదని పేర్కొన్నారు. అధికారులు స్పందించి మలుపులపై చర్యలు తీసుకుని ప్రమాదాలను తగ్గించాలని, అదేవిధంగా ఇంద్రకల్ గ్రామ సమీపంలో ఉన్న మట్టి కుప్పలను ఎత్తివేయించేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు, గ్రామస్థులు కోరుతున్నారు.

వేములవాడకు శివరాత్రి శోభ

-భారీగా ఏర్పాట్లు చేసిన అధికారులు

వేములవాడ,ఫిబ్రవరి20(నేటినిజం ప్రతినిది): వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో మహా శివరాత్రి వేడుకలు ప్రారంభమయ్యాయి. శివరాత్రి సందర్భంగా 3 రోజులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. రాత్రి 9 గంటలకు నిశిపూజ, అనంతరం మహాశివరాత్రి పూజలు నిర్వహిస్తారు. ఆలయంలో ఆర్జిత సేవలు రద్దు చేశారు. భక్తుల కోసం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఆలయ ఓపెన్ స్లాబ్ ప్రాంగణంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. జాతర సందర్భంగా సాంస్కృతిక కళా ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామని ఇవో తెలిపారు. శివరాత్రి దర్శనాలతో పాటు లింగోద్భవ కాల దర్శనాలకు కూడా ఏర్పాట్లు చేశారు. వేములవాడలో శివరాత్రి వేడుకలు చురుకుగా సాగుతున్నాయి. ఏటా శిరాత్రి జాగారం కోసం వేలాదిగా భక్తులు తరలివస్తారు. వారి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఇవో తెలిపారు. అలాగే రాజన్నను దర్శించుకునే భక్తులు రాజన్న ప్రసాదాలపై అంతే మక్కువ చూపుతారు. మహాశివరాత్రి జాతరకు రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాలనుంచి మూడు నుంచి నాలుగు లక్షల మంది వస్తారన్న అంచనాలో అధికార యంత్రాంగం ఉంది. భక్తులకు రాజన్న లడ్డూ ప్రసాదం అందించేందుకు ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేస్తున్నారు. పెద్ద ఎత్తున లడ్డూ ప్రసాదాన్ని అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. మార్చి 2 వరకు నాలుగు లక్షల లడ్డూలు సిద్ధం చేసి ఉంచుతామని, ఇవో పేర్కొన్నారు. మహాశివరాత్రి జాతరకు వచ్చే భక్తులకు స్వామివారి ప్రసాదం అందుబాటులో ఉండేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నారు.

శివరాత్రి ఉత్సావాలకు ఏడుపాయల సిద్ధం

-పెద్ద ఎత్తున ఉత్సవాల నిర్వహణ

మెదక్,ఫిబ్రవరి20(నేటినిజం ప్రతినిది): తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించేలా ఏడుపాయల జాతర ఏటా మహాశివరాత్రి సందర్భంగా మూడు రోజుల పాటు వైభవంగా జరుగనుంది. శివరాత్రి కోసం ఇక్కడికి వేలాదిగా భక్తులు రానున్నారు. మహాశివరాత్రి సందర్భంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల జాతరకు భారీగా ఏర్పాట్లు చేశారు. ఇక్కడికి వేలాదిగా భక్తులు తరలి రానుండడంతో పెద్ద ఎత్తున ఉత్సవాలు జరుగతాయి. శివరాత్రిని పురస్కరించుకుని ఇక్కడ పెద్దఎత్తున జాతర జరగనుంది. ఏటా మహాశివరాత్రి సందర్భంగా ఏడుపాయలలో జాతర కన్నుల పండువగా నిర్వహిస్తారు. మూడు రోజులపాటు పెద్దఎత్తున జరిగే ఈ జాతరను ప్రభుత్వం రాష్ట్ర ఉత్సవంగా నిర్వహిస్

శ్రీశైలానికి భారీగా చేరుకుంటున్న భక్తులు

కర్నూలు,ఫిబ్రవరి20(ఆర్ఎన్ఎ): శ్రీశైల పుణ్యక్షేత్రం భక్తులతో రద్దీగా మారింది. శివరాత్రి పర్వదినం సందర్భంగా స్వాదర్శనం చేసుకోవటానికి నల్లమల అటవీప్రాంతం నుంచి భారీగా భక్తులు తరలి రావడంతో శ్రీగిరులు భక్తులతో కోలాహలంగా మారయి. మల్లికార్జునస్వామి సర్వదర్శనానికి 5 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక దర్శనానికి 3గంటల సమయం పడుతోంది. శివస్వాముల దర్శనానికి దాదాపు 4 గంటల సమయం పడుతున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. క్యూలైన్లో వేచి ఉన్న భక్తులకు ఉచిత మజ్జిగ, అల్పాహారాన్ని పంపిణీ చేస్తున్నారు. పలు చోట్ల దాతలు అన్నదానాలను ఏర్పాటు చేశారు. ఇదిలావుంటే భక్తజనం ఓంకారం నడుమ దేవదేవులకు నందిమండపం, బయలువీరభద్రస్వామి ఆలయం వరకు గ్రామోత్సవం కనుల పండువగా జరిగింది. శ్రీగిరి పురవీధుల్లో పుష్పపల్లకీ సేవ అంగరంగ వైభవంగా జరిగింది. ఆదిదంపతులైన శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామివార్లు కల్యాణశోభతో ముస్తాబయ్యారు. ఆలయ ప్రాంగణంలోని అలంకారమండపంలో స్వామి అమ్మవార్లకు అర్చకులు, వేదపండితులు వేదమంత్రోచ్చరణ లతో విశేషపూజలు నిర్వహించారు. అనంతరం వేలాది మంది భక్తజనం నడుమ గ్రామోత్సవానికి తీసుకొచ్చారు. ఉత్సవం ముంగిట మహిళల కోలాటాలు, వేషధారణలు, డోలు విన్యాసాలు, నందికోళ విన్యాసాలు, బుట్టబొమ్మలు వంటి సాంస్కృతిక కళారూపాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆలయ ప్రాంగణం నుంచి అడుగడుగునా ఉత్సవమూర్తులకు మంగళహారతులు ఇచ్చుకుంటూ పురవీధుల్లోకి తీసుకువచ్చారు. గంగాధరమండపం వద్ద రంగు రంగుల పుష్పాలు, విద్యుద్దీపాలంకరణలతో ముస్తాబు చేసిన పుష్పపల్లకీలో శ్రీస్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను అధిష్టింపజేసి అర్చకులు మంగళహారతులిచ్చారు.

మోత్కూరులో పోటెత్తిన కందులు

–మార్కెట్‌కు మూడురోజుల సెలవు

ఆలేరు,ఫిబ్రవరి20(ఆర్ఎన్ఎ): మోత్కూరు వ్యవసాయ మార్కెట్లో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో స్థానిక రైతు సేవా సహకార సంఘం ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రానికి కందులు పోటెత్తాయి. రైతులు విరివిగా కందులు తెచ్చి పోస్తున్నా కొనుగోలు వరకు వచ్చే సరికి ఆన్‌లైన్ కష్టాలు మాత్రం తొలగడం లేదు. ఆన్‌లైన్‌లో పేరు ఉన్న కంది రైతుల నుంచే కందులు కొనుగోలు చేశారు. ఆన్‌లైన్‌లో పేరు లేని రైతుల నుంచి కూడా కందులు కొనడానికి నేడో రేపు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తాయని చెప్పినప్పటికీ రైతుల్లో మాత్రం ఆందోళన తగ్గలేదు. ఈ నెల 7న కేంద్రం ప్రారంభం కాగా ఇప్పటి వరకు 3,247 క్వింటాళ్ల కందులు కొనుగోలు చేశారు. కొనుగోలు కేంద్రంలో కందుల రాశులు పేరుక పోయి నూతనంగా పోయడానికి స్థలం లేక పోవడం, చాలా రోజుల నుంచి ఉంటున్న తమవి కొనకుండా నిన్న ఇవ్వాళ వచ్చిన వారివి ఎలా కొంటారంటూ రైతులు గొడవ చేస్తున్నందున కొనుగోలు కేంద్రానికి బుధ, గురువారాల్లో సెలవు ఇచ్చామని, శుక్రవారం మహాశివరాత్రి సెలవు కావడంతో ఇన శనివారం నుంచి మాత్రమే రైతులు కందులు తీసుకరావాలని మార్కెట్ వైస్‌చైర్మన్ కొణతం యాకూబ్‌రెడ్డి కోరారు. వరుసగా మూడు రోజులు సెలవులు ప్రకటిస్తూ మైక్‌లో చెప్పారు.

వలసలు నివారించి ఉపాధి కల్పించాలి

గ్రామాలకు దూరంగా ఇళ్ల నిర్మాణం తగదు

ఉగాది నాటికి పట్టాలు ఇస్తామన్న మంత్రి

తిరుపతి,ఫిబ్రవరి20(ఆర్ఎన్ఎ): వలసల నివారణకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదని విపక్షాలు మండపడుతున్నాయి. కాలనీల పేరుతో ఎస్సీ, ఎస్టీ, బీసీలను ఊరికి దూరంగా పంపడం అన్యాయమంటూ పలువురు ప్రజాప్రతినిధులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కరువు కారణంగా గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లారని... ప్రస్తుతం వృద్ధులు, విద్యార్థులు మాత్రమే ఇళ్ల వద్ద మిగిలారని పలువురు నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంతటి దారుణ పరిస్థితులు నెలకొన్నా ఉపాధి కల్పనకు అధికారులు చర్యలు తీసుకోక పోవడం బాధాకరమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గతంలో పంచాయతీలకోసం కొనుగోలు చేసిన మోటర్లు, పంపుసెట్లు మాయం చేశారని.... వీటిని రికవరీ చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడంలో అధికారులు చాలా నిర్లక్ష్యం చూపుతున్నారన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు సకాలంలో మరమ్మతులు చేయకపోవడంతో రైతులు పంటలను నష్ట పోవాల్సి వస్తోందన్నారు. అయితే ఉగాది పండుగ నాటికి అర్హులైన పేదలందరికీ ఇంటి పట్టాలు మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినా చాలా చోట్ల ఇంకా భూసేకరణ జరగలేదని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అడవుల్లో, చెరువుల్లో స్థలాలు చూపుతున్నారని... అలాంటి చోట్ల వారెలా కాపురం చేస్తారని అధికారులను నిలదీశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలను ఊళ్లకు దూరంగా పంపడం అన్యాయమన్నారు. గ్రామానికి కనీసం 20 నుంచి 30మంది దాకా అర్హులున్నా... కేవలం ఐదారు మందిని మాత్రమే అర్హుల జాబితాలో చేరుస్తున్నారన్నారు. స్థలాల కేటాయింపు, అర్హుల ఎంపిక విషయంలో అధికారుల తీరు కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో రచ్చలు జరుగుతున్నాయన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లు ఎక్కువ భాగం వృథాగా ఉండి పోతున్నాయని... వీటికి మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకు వచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు విడుదల విడుదల చేయించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదిలావుంటే అర్హులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించని కారణంగా గ్రామాల్లో తిరగలేకపోతున్నామని అధికార పార్టీ నేతలే అన్నారు. నిర్బంధ భూసేకరణ ద్వారా అర్హులైన పేదలందరికీ అనువైన ప్రాంతాల్లో స్థలాలు కేటాయించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. మదనపల్లలెలో తాగునీటి సమస్య పరిష్కారానికి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు.

విజయ నిర్మల కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన కృష్ణ, మహేష్

హైదరాబాద్, ఫిబ్రవరి20(ఆర్ఎన్ఎ): నటిగా, దర్శకురాలిగా, గిన్నీస్ వరల్డ్ రికార్డ్ సాధించిన మహిళగా విజయనిర్మల ఎంతో ఖ్యాతి పొందారు. గత ఏడాది జూన్‌లో ఈ లెజండరీ దర్శకురాలు కన్నుమూసారు. ఆమె మరణంతో చిత్ర పరిశ్రమ శోకసంద్రంలో మునిగిపోయింది.

ఫిబ్రవరి 20న ఆమె తొలి జయంతి సందర్భంగా విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. నానక్‌రామ్‌గూడలోని విజయనిర్మల నివాసంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా, ఇక్కడే విజయ నిర్మల కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు.

ఈ విగ్రహాన్ని సూపర్‌స్టార్ మహేష్ బాబు, కృష్ణతో పాటు పలువురు ప్రముఖులు కలిసి ఆవిష్కరించారు. కృష్ణంరాజు, నమ్రత, సుధీర్ బాబు, పరచూరి బ్రదర్స్‌తో పాటు పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నటుడు కృష్ణంరాజు మాట్లాడుతూ ఆమెతో తనకు గల అనుబంధాన్ని నెమరేసుకున్నారు. తనను అన్నయ్యా అని ఆప్యాయంగా పిలిచే వారని అన్నారు. తెలుగు, తమిళ, మలయాళం భాషల్లో 200కుపైగా చిత్రాల్లో నటించిన విజయనిర్మల.. దర్శకురాలుగా 44 చిత్రాలను

రూపొందించి.. ప్రపంచంలోనే అత్యధిక చిత్రాలకు దర్శకత్వం వహించిన తొలి మహిళా దర్శకురాలిగా ఆమె 2002లో గిన్నీస్ బుక్‌లో చోటు సంపాదించారు. 1971లో దర్శకత్వ బాధ్యతలు చేపట్టిన విజయనిర్మల 'మీనా' చిత్రంతో దర్శకురాలిగా పరిచయం అయ్యారు. సూపర్ స్టార్ కృష్ణ– విజయనిర్మల కాంబినేషన్‌లో వచ్చిన పలు చిత్రాలు బ్లాక్ బస్టర్ హిట్‌లుగా నిలిచాయి. 'సాక్షి' చిత్రంతో మొదలైన వీరి సినీ ప్రయాణం వివాహ బంధానికి కారణమైంది. సుమారు 47 చిత్రాల్లో కలిసి నటించిన వీరిద్దరి పెయిర్ ఎప్పటికీ హిట్ పెయిరే.

కందిరైతులను కుంగదీస్తున్న అమ్మకాలు

మార్క్‌ఫెడ్ కొనుగోళ్లు అంతంతమాత్రమే

అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్

యాదాద్రి,ఫిబ్రవరి20(ఆర్ఎన్ఎ): ఆరుగాలం శ్రమించిన పంటలను అమ్మడానికి రైతన్నలకు అష్టకష్టాలు తప్పడం లేదు. సాగుచేసిన పంటలు దిగుబడి వస్తే అమ్ముకోవడమూ ఓ సమస్యగా మారింది.. యాదాద్రి భువనగిరి జిల్లాలో కంది దిగుబడి చేతికి వచ్చి నెల రోజులు కావస్తున్నా మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాలు స్వల్పంగా ఉండడంతో కందుల రాశులు పేరుకు పోతున్నాయి. కొనుగోళ్లకు ఆన్‌లైన్ నమోదు వంటి తిప్పలు పడుతున్నారు. పూర్తిస్థాయిలో కొనుగోళ్లు కూడా ప్రారంభించకుండానే కేవలం ఫిబ్రవరి నెలాఖరు వరకే కొనుగోళ్లు చేసి చేతులు దులుపుకోవాలని మార్క్‌ఫెడ్ అధికారులు భావిస్తున్నారు. రైతుల ఆందోళనను దృష్టిలో పెట్టుకున్న కలెక్టర్ అనితా రామచంద్రన్ ఉన్నతాధికారులతో సంప్రదింపులు చేస్తున్నారు. వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా పూర్తిస్థాయిలో కందులు కొనుగోళ్లకు ఏర్పాట్లు పెంచాలని తాజాగా మార్క్‌ఫెడ్‌కు ప్రతిపాదనలు పంపినట్టు జిల్లా మార్కెటింగ్ అధికారులు చెబుతున్నారు.

ఖరీఫ్ సీజన్‌లో ఆలస్యంగా వర్షాలు కురిసి.. సాగు చేసిన పునాస పంటలు ఎండిపోగా.. కంది వంటి దీర్ఘకాలిక పంట చేతికి వస్తే.. కొనుగోళ్లు చేసే పరిస్థితులు లేక అన్నదాతలకు అవస్థలు తప్పడం లేదు.. రైతులను ఆదుకోవడానికి కనీస మద్దతు ధర.. కొనుగోళ్లకు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని ప్రకటిస్తున్న ప్రభుత్వం ఆచరణలో విఫలమైతుండటం అన్నదాతలకు శాపంగా మారింది. ఈ ఖరీఫ్ సీజన్‌లో కందుల దిగుబడి సాధారణం కంటే ఎక్కువగా ఉంది. దీంతో జిల్లాలో రైతుల నుంచి కందులను ప్రభుత్వ కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయడానికి మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఆరు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు ప్రతిపాదించారు. జిల్లాలో కందుల దిగుబడి అదికంగా ఉండే మోత్కూరు, మోటకొండూరు, ఆలేరు, భువనగిరి, చౌటుప్పల్, ఆలేరు కేంద్రాల్లో ఏర్పాటు చేయాలని జిల్లా అధికార యంత్రాంగం నిర్ణయించింది. అయితే రైతుల ఇంటికి కందుల దిగుబడి ప్రారంభమై నెల గడిచి పోతున్నా.. ఈ ఏడాది చాలా ఆలస్యంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు సన్నాహాలు ప్రారంభించారు. పీఏసీఎస్ ఎన్నికల నేపద్యంలో కేవలం అయిదారు రోజుల క్రితమే మోత్కూరు, మోటకొండూరు కేంద్రాలుగా రెండు చోట్ల మాత్రమే కొనుగోల్లు ప్రారంభించారు. ఆలేరులో బుధవారం ప్రారంభిస్తామని అధికారులు అంటున్నారు. మిగిలిన రాజాపేట, భువనగిరి, చౌటుప్పల్ కొనుగోలు కేంద్రాలను ఇంతవరకు ప్రారంభించలేదు. ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో కంది సాగు విస్తీర్ణం అధికంగా జరగడంతో దిగుబడి కూడ భారీగా పెరగనుంది. అయితే మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో జిల్లాలో కందుల కొనుగోళ్ల లక్ష్యం పరిమితంగా ఉండటంతో రైతుల్లో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో ఈసారి 20, 400 ఎకరాల్లో కంది పంటను రైతులు సాగు చేశారు. ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా జిల్లాలో ఏర్పాటు చేసిన ఆరు కొనుగోలు కేంద్రాల్లో ఈ ఏడాది 16,660 మెట్రిక్ క్వింటాళ్ల కందులను కొనుగోలు చేయాలనే లక్ష్యం పెటటుకున్నారు. జిల్లాలో ఆరు కొనుగోలు కేంద్రాలకు ఇప్పటి వరకు రెండు మాత్రమే ప్రారంభించారు. ఈ కొనుగోలు కేంద్రాల్లో సైతం ఆన్‌లైన్‌లో పేర్ల నమోదు వంటి కొర్రీల కారణంగా కొనుగోళ్లు సాగక రైతులకు అవస్థలు తప్పడం లేదు. మార్క్‌ఫెడ్ కొనుగోళ్లకు కాలంతో పాటు పరిమాణంపై పరిమితులు విధిస్తున్న పరిస్థితుల్లో పండించిన కందులను అమ్ముకునేదెట్లా.. పంటల సాగుకు చేసిన అప్పులు తీర్చేది ఎలా అనే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అక్రమణ చెరలో దేవాలయ భూములు

కోట్లు విలువ చేసే భూములకు ప్రైవేట్ పట్టాలు

నిద్ర వీడని దేవాదాయ శాఖఅధికారులు

తసూర్యాపేట,ఫిబ్రవరి20(ఆర్ఎన్ఎ): జిల్లాలో అనేక దేవాలయ భూములు ఆక్రమణకు గురయ్యాయి. ఇంత జరుగుతన్నా దేవాదాయ శాఖ అధికారుల దృష్టి పెట్టడం లేదు. సర్వే నంబర్లు మార్చి రైతుబంధు సహా అనేక పథకాలు పొందుతున్నారు. దేవాదాయ భూముల పక్కనే ఉన్న సర్వే నెంబర్ వేసి రిజిస్ట్రేషన్ చేయించుకొని రైతుబంధు పథకం కూడా పొందుతున్నారు. కౌలుకు తీసుకున్న వారు కూడా చెల్లించడంలేదు. ఫిబ్రవరి 15 నుంచి మార్చి 31వరకు దేవాలయ భూములపై ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్ నిర్వహించనుంది. ఈ డ్రైవ్ ఫలితంగా కనీసం దూప, దీప నైవేద్యానికి నోచుకొని దేవాలయాలకు కొంత అయిన భూమి లభిస్తుందని పూజారులు పేర్కొంటున్నారు. దీని వల్ల ఆయా దేవాలయాల్లో దూప, దీప నైవేద్యాలతో పాటు మహోత్సవాలను నిర్వహించేందుకు అవకాశం లభిస్తుంది. ఆత్మకూర్(ఎస్) మండలం కందగట్ల లక్ష్మీనర్సింహ్మస్వామి దేవాలయం పరిధిలో 654 ఎకరాల భూమి ఉంది. ముందుగా కౌలుకు చేశారు. ఆ తర్వాత కౌలు చెల్లించడం మానేశారు. ఏకంగా పక్కా భూముల సర్వే నెంబర్ వేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. దేవాలయం మొత్తం శిథిలావస్థకు చేరింది. అక్కడ దేవాలయ భూములను పరిరక్షించే వారు కరువయ్యారు. అర్వపల్లి మండల కేంద్రంలోని యోగానంద లక్ష్మీనర్సింహ్మస్వామి ఆలయం పరిధిలో 750 ఎకరాల భూమి ఉండగా 650 ఎకరాల భూమి కౌలుకు తీసుకొని సేద్యం చేస్తున్నారు. సంవత్సరానికి రూ.500 మాత్రమే చెల్లించి కౌలు చేస్తున్నారు. మరో 100 ఎకరాలు అక్రమణకు గురయ్యాయి. ఎంతోమంది ఇళ్లు కట్టుకొని నివాసముంటున్నారు. రిజిస్ట్రేషన్లు కూడా మారిపోయాయి. మొతె మండలం ఉండ్రుగొండ లక్ష్మీనర్సింహ్మస్వామి దేవాలయం కింద 100కు పైగా ఎకరాలు ఉండేది. కౌలుకు తీసుకున్న వారు ఏకంగా ఆక్రమించుకున్నారు. మద్దిరాల మండలం గోరెంట్ల వేంకటేశ్వరస్వామి, శివాలయాల కింద 150 ఎకరాల భూమి ఉంటే సుమారు 30 ఎకరాల భూమి అన్యాక్రాంతమైంది. నాగారం మండలంలోని ఫణిగిరి లక్ష్మీనర్సింహ్మస్వామి దేవాలయం, శ్రీరామ ఆలయానికి సంబంధించిన భూములను కూడా పట్టాలు చేసుకున్నట్లు సమాచారం. చివ్వెంల మండలం దురాజ్‌పల్లి లింగమంతుల స్వామి గుడి కింద 26 ఎకరాల దేవాలయ భూమి ఉండగా 15 గుంటలు సబ్‌స్టేషన్ నిర్మాణానికి అందజేశారు. అది పోనూ మిగిలిన భూమిలో 5 ఎకరాల దాకా అన్యాక్రాంతమైనట్లు తెలుస్తుంది. చివ్వెంల మండలం ఉండ్రుగొండ ఫారెస్టు భూమి 2వేల ఎకరాలకు పైగా ఉండగా 100 ఎకరాల దాకా చుట్టు పక్కలా వారు అక్రమించుకున్నారు. పెన్‌పహాడ్ మండలంలోని నాగులపహాడ్ త్రికుటేశ్వర దేవాలయం కింద 4 ఎకరాల భూమి ఉండాల్సి ఉంది. కేవలం ఎకరం మాత్రమే ఉంది. పక్కా రైతులు అక్రమించుకొని పట్టాలు చేయించుకున్నారు. హుజుర్‌నగర్ మండలం బూరుగడ్డ గ్రామంలోని వేణుగోపాలస్వామి దేవాలయం పరిధిలో 650 ఎకరాలుంటే 350 మంది రైతులు సేద్యం చేస్తున్నారు. ఎకరానికి రైతులు రూ.3వేలు కౌలు చెల్లిస్తున్నారు. దీనిలో కూడా 100 ఎకరాలు అన్యాక్రాంతమైనట్లు తెలుస్తుంది. మొతె మండలంలోని ఉర్లుగొండ లక్ష్మీనర్సింహ్మస్వామి దేవాలయం పరిధిలో 80 ఎకరాల భూమి ఉండాలి. 15 ఎకరాల భూమి అన్యాక్రాంతమైంది. ఎస్సారెస్పీ కాల్వల కింద 6 ఎకరాల భూమి పోయింది. కౌలు కూడా కొంత మంది చెల్లించడం లేదని తెలుస్తుంది. అయితే వరుసగా విమర్శలు రావడంతో దేవాదాయ శాఖ ఇప్పుడిప్పుడే మేల్కొంటుంది. కబ్జాకు గురైన భూములను సంరక్షించుకోవాలని రాష్ట్ర వ్యాప్తంగా చర్యలు చేపట్టింది. దేవాలయాల సమీపంలో భూముల సర్వే నెంబర్లు బోర్డులపై రాసే కార్యక్రమం కొనసాగుతుంది. ఎక్కడ భూములు అక్రమణకు గురయయ్యో ఆరా తీస్తున్నారు. జిల్లాలో అన్ని దేవాలయాల వద్ద సరిహద్దులను ఏర్పాటు చేయాలని సంబంధిత దేవాదాయ శాఖ ఈవోలకు, మేనేజర్లకు ఉత్తర్వులు అందాయి. అక్రమించుకున్న వారు భూములను ఇవ్వకుంటే ఎండోమెంట్ ట్రిబ్యునల్ కోర్టుల్లో కేసులు నమోదు చేయాలని స్పష్టంగా ఆదేశాలు ఇచ్చారు.

తండాల అభివృద్ధికి సిఎం కేసీఆర్ పట్టు

గాంధీజీ ఆదర్శాల మేరకు అభివృద్ధి

పల్లె నిద్రలో పాల్గొన్న మంత్రి సత్యవతి

తండావాసులకు ఆత్మీయపలకరింపు

సమస్యల పరిష్కారానికి హామీ

మహబూబాబాద్,ఫిబ్రవరి20(ఆర్ఎన్ఎ): తండాలను పంచాయితీలుగా చేశాక అభివృద్ధికి బాటలు పడుతున్నాయని, గతంతో పోలిస్తే మార్పులు వచ్చాయని రాష్ట్ర గిరిజన, స్త్రీ–శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. సీఎం కేసీఆర్ తండాలను గ్రామ పంచాయతీలు చేశాక, ఇక్కడ 5 గ్రామాలు అయ్యాయన్నారు. ప్రతి నెలా 339 కోట్ల రూపాయలను ఇస్తూ, గ్రామాలు అన్ని విధాలా స్వయం సమృద్ధిగా ఉండాలని, గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం రావాలని సీఎం పని చేస్తున్నారని మంత్రి తెలిపారు.

పల్లె ప్రగతి పర్యవేక్షణలో భాగంగా గ్రామంలోని ప్రతి ఇంటికీ తిరుగుతూ.. వారిని ఆత్మీయంగా పలకరిస్తూ, సమస్యలు తెలుసుకున్నారు. జిల్లాను అన్నివిధాలా అభివృద్ధి చేస్తానని తెలిపారు. తన సొంతూరు పెద్ద తండాలో వేకువజామున 6 గంటలకు వేవవుల్ల వేసుకొని వాడవాడలా కలియదిరుగుతూ అందరిని వరుసలతో పిలుస్తూ.. వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి చిన్నారులను ప్రేమతో పలకరించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్లలె నిద్ర చేయాలని ఇచ్చిన ఆదేశాల మేరకు మంత్రి సత్యవతి రాథోడ్ తన సొంతూరు పెద్దతండాలో బుదశారం రాత్రి పల్లె నిద్ర చేసి, గురువారం ఉదయమే తండాలో ప్రగతి పనులు పర్యవేక్షించారు. గత 30 ఏళ్లుగా అనుబంధం ఉన్న గ్రామస్తులను, పల్లెను చూసి తరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 50 ఏళ్లుగా ఈ తండాతో అనుబంధం ఉంది. నా సొంత తండాలో సమస్యలు పరిష్కారం చేసేందుకు పల్లె ప్రగతి కార్యక్రమాన్ని పర్యావేక్షించానన్నారు. తండాలో సమస్యలు గుర్తించి, అధికారులను పిలిపించి మాట్లాడుతానని మంత్రి అన్నారు. గతంలో సర్పంచ్ గా ఉన్నప్పుడు జన్మభూమి కార్యక్రమంలో తండాలో చాలా పనులు చేశానని మంత్రి అన్నారు. తండాలో రోడ్లు కావాలని, అక్కడక్కడ నీటి సమస్య ఉందనీ.. మంత్రి అయ్యాక తండా అభివృద్ధి కోసం లక్ష రూపాయలు ఇస్తానని ప్రకటించానని తెలిపిన మంత్రి.. ఈరోజు రూ.25 లక్షలతో సీసీ రోడ్లను మంజూరు చేస్తున్నానని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. వెంటనే పనులు ప్రారంభించేలా మంత్రి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ తండాలో ఏ ఒక్కరికి తాగునీటి సమస్య ఉండకూడదు. వారం రోజుల్లో కరెంట్ ఇబ్బందులన్నీ తొలగిస్తామని మంత్రి తెలిపారు. పల్ఎలె ప్రగతిలో భాగంగా నర్సరీలు అభివృద్ధి చేశాము. ఇల్లు లేని పేద వాళ్ళకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇస్తామని మంత్రి అన్నారు. ఎస్.ఆర్.ఎస్.పి నీళ్లు కూడా వచ్చేలా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా మంత్రి సత్యవతి రాథోడ్ వెల్లడించారు. మహాదేవుని చెరువు ఆక్రమణకు గురి కాకుండా చూడాలని మంత్రి అధికారులను ఆదేశించారు. రోడ్లు, ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. వాటిని ప్రజోపయోగ కార్యక్రమాలకు వినియోగిస్తామని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో ప్రజలకు అందిస్తున్న పథకాలు వారికి చేరేలా వారధుల్లా పని చేస్తామని మంత్రి అన్నారు. ఈ జిల్లా ఇంచార్జి మంత్రిగా.. ఈ నియోజక వర్గం, ఈ తండాలో పుట్టిన బిడ్డగా ఇక్కడ అవసరమైన నిధులు కేటాయించి, వచ్చే 4 ఏళ్లలో ఏ సమస్య లేకుండా పనులు చేయిస్తానని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. తండావాసులు కూడా మంత్రి సత్యవతిని ఆదరించి అభినందనలు తెలిపారు.

చిన్న పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహం కరవు

నిరుద్యోగ సమస్య తీర్చడంలో సర్కార్ విఫలం: లక్ష్మణ్

హైదరాబాద్,ఫిబ్రవరి20(ఆర్ఎన్ఎ): ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడంతో చిన్న పరిశ్రమలు ఏర్పాటు కావడం లేదని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు లక్ష్మణ్ విమర్శించారు. పరిశ్రమల ఏర్పాటుకు తగిన ప్రోత్సాహం దక్కడం లేదన్నారు.

అలాగే ప్రభుత్వ పరంగా పరిశ్రమల ఏర్పాటు జరగడం లేద్నారు. నిరుద్యోగులు పెరుగుతున్నా ఉద్యోగాల భర్తీ జరగడం లేదన్నాఉ. పదిమంది కలిసి క్లస్టర్‌గా ఏర్పడి చిన్న పరిశ్రమలను ఏర్పాటు చేసుకోవాలన్నారు.

తెలంగాణ రాష్ట్రంలో 3 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని లక్ష్మణ్ వ్యాఖ్యానించారు. తెలంగాణ దశా దిశ మార్చడంలో ఎంఎస్ఎంఈ కీలకపాత్ర పోషిస్తోందనిన్నారు.

ఉద్యోగాల కోసం పట్టణాలకు వలస వెళ్లే పరిస్థితి మారాలన్నారు. ఎంఎస్ఎంఈ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లో ఒక జిల్లా–ఒక ఉత్పత్తిపై సదస్సు జరుగుతోంది. ఈ కార్యక్రమానికి తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు లక్ష్మణ్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెందుర్తి, నిర్మల్, తాండూరు, ఖమ్మం, సిరిసిల్ల, గద్వాలలో ఎంఎస్ఎంఈ ప్రాజక్టులకు అనేక అవకాశాలున్నాయన్నారు. ప్రభుత్వం ఇక్కడి అవకాశాలను అందిపుచ్చుకునియువతను ప్రోత్సహించాలన్నారు.

విడాకులు తీసుకున్న స్వాతిమలివాల్

–పిన్న వయసులో మహిళా కమిషన్ సభ్యురాలిగా సేవలు

న్యూఢిల్లీ,ఫిబ్రవరి20(ఆర్ఎన్ఎ): ఢిల్లీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ స్వాతి మలివాల్...భర్తతో విడాకులు తీసుకున్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ హర్యానా కన్వీనర్ నవీన్ జైహింద్(39) నుంచి ఆమె చట్టబద్ధంగా విడిపోయారు. స్వాతి మలివాల్ దేశంలోనే అత్యంత పిన్న వయసులో మహిళా కమిషన్ బాధ్యతలు చేపట్టిన వ్యక్తిగా రికార్డు నెలకొల్పిన సంగతి తెలిసిందే. భర్తకు విడాకులిచ్చినట్లు బుధవారం ప్రకటించిన ఆమె.. దంపతులుగా కలిసుండటంలో, విడిపోవాలనుకున్నప్పుడు ఎదుర్కొన్న సమస్యల్ని ప్రస్తావిస్తూ భావోద్వేగంతో కూడిన సందేశాన్ని పోస్టు చేశారు. ఘజియాబాద్‌లో పుట్టిపెరిగిన స్వాతి, ఢిల్లీలోని ప్రఖ్యాత జేఎస్ఎస్ కాలేజీలో ఐటీలో డిగ్రీ చేశారు. అన్నా హజారే నేతృత్వంలో ఉధృతంగా సాగిన అవినీతి వ్యతిరేక పోరాటంలో ఆమె భాగం పంచుకున్నారు. ఆ ఉద్యమంలోనే ఆమెకు నవీన్ జైహింద్‌తో పరిచయం, ప్రేమ ఏర్పడ్డాయి. కొంతకాలం కలిసుండి పెళ్లిచేసుకున్నారు. ఆ తర్వాత ఇద్దరూ అరవింద్ కేజ్రీవాల్ ఆమ్ ఆద్మీ పార్టీలో చేరిపోయారు. పార్టీ హర్యానా విభాగానికి నవీన్ కన్వీనర్ కాగా, ఢిల్లీలో ఎమ్మెల్యే టికెట్ మిస్ కావడంతో స్వాతికి మహిళా కమిషన్ వైర్ పర్సన్ పదవి దక్కింది. చిన్న వయసులోనే డీసీఎం వైర్ పర్సన్ గా బాధ్యతలు చేపట్టిన స్వాతి మలివాల్.. మహిళల సమస్యల పరిష్కారానికి తీవ్రంగా పాటుపడ్డారు. చిన్నారులపై అత్యాచారాలు చేసేవాళ్లకు కఠినంగా శిక్షలు విధించేలా పోక్సో చట్టం రావడంలో ఆమె కృషి కూడా ఉంది. అత్యాచారాలకు వ్యతిరేకంగా ఇటీవలే నిరాహార దీక్ష కూడా చేపట్టారామె. కాగా, మీటూ ఉద్యమం సమయంలో స్వాతి భర్త నవీన్.. మహిళలను కించపరుస్తూ చేసిన కామెంట్లు దంపతుల మధ్య చిచ్చుపెట్టింది. అప్పటి నుంచి క్రమంగా దూరమైన జంట.. బుధవారం నాటికి విడాకులు తీసుకుంది.

కట్, కాపీ, పేస్ట్, సృష్టికర్త లారీ టెస్లర్ కన్నుమూత

న్యూఢిల్లీ,ఫిబ్రవరి20(ఆర్ఎన్ఎ): కట్, కాపీ, పేస్ట్.. లాంటి కమాండ్లను రూపొందించిన కంప్యూటర్ శాస్త్రవేత్త లారీ టెస్లర్ కన్నుమూశారు. ఆయన వయసు 74 ఏళ్లు. కంప్యూటర్ అభివృద్ధిలో లారీ టెస్లర్ ఎంతో కృషి చేశారు. 1960 దశకంలో కాలిఫోర్నియాలోని సిలికాన్ వ్యాలీలో పనిచేసిన టెస్లర్.. సులువైన కంప్యూటర్ కమాండ్లను రూపొందించారు. కంప్యూటర్ల విజ్ఞానాన్ని సులభతరం చేసిన కట్, కాపీ, పేస్ట్ లాంటి కమాండ్లను ఈయనే కనుగొన్నారు. లారీ టెస్లర్ మృతి పట్ల జిరాక్స్ కంపెనీ నివాళి అర్పించింది. 1945ల

తెలంగాణాకే తలమానికంరాజన్న క్షేత్రం....

వేములవాడ, ఫిబ్రవరి 20: నాగేంద్రహారాయ త్రిలోచనాయా । భస్మాంగరాగాయ మహేశ్వరాయ ॥ నిత్యాయ శుద్ధాయ దిగంబరాయ । తస్మై 'న' కారాయ నమ: శివాయ ॥ నాగేంద్రుడిని హారముగా ధరించినవాడు, మూడు కన్నులు గలవాడు, శరీరమంతా భస్మాన్ని పూసుకున్నవాడు, భూమికి అధిపతి అయినవాడు, మూడు కాలాలపాటు నిత్యం ఉండేవాడు, దిక్కులను వస్త్రాలుగా ధరించినవాడు, పరమేశ్వరుడైన ఆ దేవదేవునికి నమస్కారమని ఈ శ్లోకం విశదీకరిస్తుంది. అలాగే సూర్య, చంద్రాగ్నులతో మూడు కన్నులు గల త్రినేత్రుడు, మూడు లోకములకు, మూడుమూర్తులకు, మూడు కాలాలకు మూలమైనవాడు, సృష్టిస్థితి,లయకారుడు, ఈ జగత్తుకంతా అంతరాత్మ అయిన ఆ పరమేశ్వరుడు మాఘ బహుళ చతుర్దశి అర్ధరాత్రి 12 గంటలకు, కారు చీకట్లో కాంతులీనుతూ, తేజోమయ మైన, దివ్య కాంతులతో జ్యోతిర్లింగ రూపంలో ఆవిర్భవించే దినమే మహాశివరాత్రి పర్వదినంగా పరిగణిస్తారు.

– మహాశివరాత్రి విశిష్ఠత :

శ్లో ॥ మాఘమాసే కృష్ణపక్షే చతుర్దశ్యా ముపోషిత:।
అర్ధరాత్రౌతు జనసంగ జాతశ్శంభు స్వయం హర:॥

మాఘమాసంలోని కృష్ణ పక్షంలో వచ్చే చతుర్దశి తిథినాడు అర్ధరాత్రి జ్యోతి స్వరూపుడైన మహాశివుడు స్వయంగా ఆవిర్భవించే దినమే మహాశివరాత్రి పర్వదినమని ఈ శ్లోకం చెబుతుండగా

శ్లో ॥ యద్యర్ధరాత్ర పర్యంతం భవేచ్ఛివ చతుర్దశి ।
సూర్యోదయం సమారభ్య సైవోపోష్య మహాఫలం ॥

మహాశివరాత్రి పర్వదినం రోజున రాత్రంతా (తెల్లవారేవరకు) శివనామ స్మరణతో ఉపవాసంతో కూడిన జాగరణ చేసినట్లయితే సమస్త యాగక్రతువులు నిర్వహించిన పుణ్యఫలం లభిస్తుందని పురాణాలు చెబుతున్నాయి.

దక్షిణ భారతదేశంలోనే పురాణ ప్రసిద్ధమైన శైవ క్షేత్రాలలో దక్షిణ కాశిగా పేరుగాంచిన అతి ప్రాచీన క్షేత్రం వేముల వాడ. రాష్ట్ర రాజధాని హైద్రాబాద్‌కు 150 కిలోమీటర్ల దూరంలో ఉంది. వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి దేవాలయం తెలంగాణ ప్రాంత భక్తుల కల్పతరువై తెలంగాణకే తలమానికమై బాసిల్లుతుంది. తెలంగాణ ప్రాంత పేదప్రజల కోరిన కోర్కెల తీర్చడంలో ఎముులాడ రాజన్న కొంగు బంగారం చేసే ఇలవేల్పుగా పూజలు అందుకుంటున్నాడు. పరమశివుడి వాహనమైన నందిని ఆరాధించడానికి ఈక్షేత్రాన్ని సందర్శించే భక్తులు కోడె మొక్కు చెల్లించడం ఆనవాయితి. నూతన వధూవ రులు కొడుకు పుడితే కోడెమొక్కు చెల్లించుకుంటామంటూ మొక్కుతరు. దేశవ్యాప్తంగా ఏ శైవక్షేత్రాలలో లేని అచారాలు ఇక్కడ కొనసాగుతుండడంతో అవి భక్తజనాలను ఎంతగానో అకట్టుకుంటాయి.

మహాశివరాత్రి ప్రత్యేకత... మాఘబ హుళ చతుర్థశి మహాశివరాత్రి రోజున సాయంత్రం 6గంటల నుండి 9గంటల వరకు శ్రీరాజరాజేశ్వర స్వామి వారికి మహాలింగార్చన అర్చకులు ఘనంగా నిర్వహిస్తారు. ఆర్ధరాత్రి 11.30 గంటల సమయంలో అత్యంత వైభవంగా మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహిస్తారు. ఈ సమయంలో స్వామి వారిని దర్శించుకునే భాగ్యం కల్గినవారు వారి జన్మధన్యమైనట్లుగా భావిస్తారు.

స్థలపురాణం... భక్తులకు కొండంత అండగా కోరిన కోర్కెలు తీర్చుతూ ప్రసిద్ధ క్షేత్రంగా వెలుగొందుతున్న వేములవాడ క్షేత్రఖ్యాతి పురాణాల్లో ప్రముఖంగా పేర్కొనబడింది. లేంబాల వాటికగా అలనాడు పేరుగాంచి నాటి చాళుక్యరాజుల ధార్మిక దృష్టికి వేములవాడ వాసికెక్కింది. స్వర్గ, సుఖ, భోగభాగ్యాలకు నిలయమైన సుక్షేత్రములను వెతుకుతూ పరమశివుడు భూలోకంలో తన నిత్యనివాసానికై ఎన్నుకున్న ఈ దివ్యక్షేత్రమే లేంబులవాటిక క్షేత్రమని పురాణాల్లో పేర్కొనబడింది. భవిష్యోత్తర పురాణంలోని రాజరాజేశ్వర యుగం నుండి వర్ణింపబడుతుంది. కృతయుగంలో వృత్తాసురుడనే బ్రహ్మరాక్షసుడినే సంహ రించిన పిదప బ్రహ్మహత్యాపాతకాన్ని పొగొట్టుకోవడానికై ఈ క్షేత్రశ్వరుని దర్శించి పవిత్రుడైనట్లుగా చెప్పబడింది. అందుల వల్లనే ఈ క్షేత్రాన్ని భాస్కర క్షేత్రమంటారు. దక్షుడు ఇక్కడే యజ్ఞంచేసి శివదిక్కార నేరానికిగానూ వీరభద్రుడిచే శిక్షింపబడి జ్ఞానాన్ని పొందడం వలన ఈ క్షేత్రాన్ని దక్షవాటిక అని కూడా అంటారు. ఇక్కడి ధర్మగుండానికి ఒక ప్రత్యేకత ఉంది ద్వాదశ జ్యోతిర్లింగాలు అన్ని నది పరివాహక ప్రాంతాలలో ఉండగా ఇక్కడి శైవక్షేత్రంలో ఎక్కడ లేని విధంగా ఎడమవైపు ధర్మగుండం ఉండడం విశేషం.. అది శక్తి మహిసాసుర మర్ధిని ఇక్కడే ప్రాదుర్భవించగా సమస్త దేవతలు ఆమెను అభిషేకించగా ఆ పవిత్రజలం ఇక్కడ పుష్కరిణిలో ప్రవేశించడం వల్ల ఈ పుష్కరిణి సకలనది జలాల సంగమమే ధర్మగుండమని 'రాజేశ్వర తరంగ'మని ప్రఖ్యాతి పొందింది.

శ్రీకృష్ణభగవానుడు తన అష్ట భార్యల్లో జాంబవతిదేవియందు సాంబుడనే కుమారు డిని, శ్రీరాజరాజేశ్వర స్వామి వరప్రసాద మేనని అందుకే యాదవులకు (శ్రేష్ఠుడైన శ్రీకృష్ణుడు స్వామి వారికి కోడెను కట్టి మొక్కును చెల్లించుకున్నట్లు పురాణగాథ...

ధర్మదేవత ఎన్నోయేళ్లు తపస్సుచేసి 'వాహనంతే భవిష్యామి' ఓ పరమశివా నేను నీకు వాహన మయ్యేదనని కోరగా శివుడు అందుకు అంగీకరించి వృషభరూపంలో ధర్మదేవతను వాహనంగా స్వీకరించెనని పురాణాలు చెబుతున్నాయి. అంతేకాకుండా పాండవులు ఈ క్షేత్రాన్ని దర్శించి దక్షిణ భారతదేశయాత్రకు వెళ్లినట్లు ఇతిహాసాల్లో తెలుస్తుంది. భీమేశ్వరాలయంలో భారీ ఆకారంలో గల లింగం, సోమేశ్వర, ఉమామహేశ్వర, బాలరాజేశ్వర, తదితర లింగామూర్తులను పాండవులు ప్రతిష్ఠించి నట్లు పురాణగాథలు తెలియపరుస్తున్నాయి.

చారిత్రక విశిష్టత... ఈ క్షేత్రాన్ని ప్రథమంగా మాళవ దేశాధిపతి రాజరాజ నరేంద్రుడు నిర్మించినట్లు క్రీశ 750 నుండి 973వరకు పాలించిన చాళుక్యరాజుల కాలం నుండి వేములవాడ ఒక సుప్రసిద్ధ నగరంగా, పుణ్యక్షేత్రంగా బాసిల్లుతోంది. వీరిలో వినయాదిత్యమల్లుడు, హరికేసరి, నర్సింహాభూపతి, రాజాధిత్యుడు, రెండవ యుద్ధమల్లుడు, రెండవ నర్సింహ దేవుడు, మూడవ హరికేసరుడు వేములవాడ చాళుక్యులుగా ప్రసిద్ధిగాంచినట్లు తెలుస్తుంది. ఆ కాలంలో సంస్కృత,ఆంధ్ర, కర్నాటక బాషలకు నిలయంగా వేములవాడ విరాజిల్లుతుంది. వివిధ మతాలు, మత ప్రచార కేంద్రాలు, విద్యా, వైద్య కేంద్రాలు నిర్వహించనట్లు స్థలపురాణం ద్వారా తెలుస్తుంది. వేములవాడ భీమకవి ఇక్కడివాడేనని, పంపమహాకవి ఇక్కడుండే కన్నడ మహాభారతాన్ని రాసాడని వాదనలు వినిపిస్తాయి. అదేకాకుండా భీమకవి ఇక్కడ నివసించడానికి తార్కాణంగా ఆయన రచించిన పలు పద్యాలలోని దేవాలయాలు ఇక్కడ ఉన్నాయి. ఆ కాలంలోనే శైవ, వైష్ణవ, శాక్తేయాది మతాలతో పాటుగా జైన మతాన్ని కూడా ఆధరించినట్లు తెలుస్తుంది. కాలక్రమేనా వేములవాడలో కురు గ్రామంగా మారి తిరిగి పెద్దపట్టణంగా మారేందుకు రూపురేకలు తీర్చిదిద్దుకుంటుంది. రాజన్న దర్శనార్థం వచ్చే భక్తులు అనుబంధ దేవాలయాలైన నగరేశ్వర, భీమేశ్వర, కేదారీశ్వర, బద్దిపోచమ్మ, వేణుగోపాల స్వామి, నాంపల్లి లక్ష్మినరసింహ స్వామి ఆ యా దేవాలయాల్లో కొలువుదీరిన దేవతా మూర్తులను దర్శించుకోవడం వల్ల ఎన్నో జన్మన పుణ్యఫలంగా భక్తులు భావిస్తారు.

అనుబంధ దేవాలయాల విశిష్టత.. క్రీస్తుశకం 850 నుండి 895 వరకు పరిపాలించిన రెండవ యుద్ధమల్లుని కుమారుడైన బద్దిగ భూవతిచే వేములవాడ భీమేశ్వరాలయం నిర్మించినట్లు పురాణాల ద్వారా తెలుస్తుంది. భీమేశ్వరాలయంలో భీముడు శివలింగాన్ని ప్రతిష్ఠించాడని ప్రతీతి.. ఇందుకుగానూ భీమేశ్వరాలయంగా పిలువబడుతున్నట్లు ఆలయ అర్చకులు పేర్కొంటున్నారు.

వేములవాడ భీమకవి ఈ భీమేశ్వర ప్రసాద సంభూతుడని అంటారు. ఈ ఆలయంలోనే పురాతన వాటావృక్షం కింద వటసావిత్రి వ్రతం అచరించే ఆచారం నేటికి ఉంది. ఈ ఆలయంలో ఘనాపాటి దేవరాజు, బుచ్చి కిష్టయ్యలు వంశపార పార్యంగా ఆలయ పూజారులుగా వ్యవహరి స్తున్నారు. ఎన్నో అపురూప శిల్పాలు, శిల్పకళాఖండికలు భీమేశ్వరాలయంలో భద్రపరిచి ఉంచడం విశేషం. వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారి దేవస్థానంతో పాటు అత్యంత ప్రాశస్యత కలిగి ఉన్న భీమేశ్వరాలయంలో భక్తులు తమ మొక్కులను చెల్లించుకుంటారు. అంతేకాకుండా మరొ అనుబంధ దేవాలయమైన బద్దిపోచమ్మ అమ్మవారికి స్త్రీమూర్తిగా భక్తులకు నిత్యము దర్శనమిచ్చే అమ్మవారికి భక్తులు బోనాలు సమర్పించి శక్త్యానుసారం సేవించి తరించడం అనవాయితీ. మాఘబహుళ అమావాస్య రోజున ఇక్కడ జాతర నిర్వహిస్తారు. రాజన్నను దర్శించుకుని బద్దిపోచమ్మకు బోనాలు సమర్పించుకోవడం అనవాయితీగా వస్తుంది. బోనాలు సమర్పించుకున్న తరువాతనే యాత్ర సఫలమైందని భక్తులు భావిస్తారు. ఈ ఆలయాలతో పాటు నగరేశ్వర, కేదారీశ్వర, వేణుగోపాల స్వామి, మహాలక్ష్మి, కనకదుర్గ, మహిసాసురమర్ధిని, అంజనేయ స్వామి దేవాలయాలతో పాటు దేవతామూ ర్తులను దర్శించుకుంటారు. శ్రీరామనవమి, నవరాత్రలు, హనుమాన్ జయంతి, శ్రీజగద్గురు శంకరాచార్య జయంతి, తొలి ఏకాదశి, శ్రావణ శుద్ధ పౌర్ణమి, శ్రీకృష్ణాష్ట మి, గణపతి నవరాత్రు లు, శరన్నవ రాత్రులు, కొజాగిరి పౌర్ణమి, ధనుర్మాసం, వైకుంఠ ఏకాదశి, దత్త జయంతి, కాలభైరవాష్టమి, త్యాగరాజు ఉత్సవాలు, మహాశివరాత్రి, హోలి పండుగ, శివకళ్యా ణం తదితర పండుగల సందర్భంగా శ్రీరాజరాజేశ్వర స్వామి వారి దేవాలయ ంతో పాటు అనుబంధ దేవాలయాలను అత్యంత ఆకర్షణీయంగా తీర్చిదిద్ది పూజలు నిర్వహిస్తారు. అంతేకాకుండా భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని దర్శిస్తారు.

శివపార్వతుల సందడి... ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతూ అత్యంత ప్రాచుర్యం పొందిన వేములవాడ శ్రీరాజరా జేశ్వర స్వామి శైవక్షేత్రంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరుపుకోవడం సనాతన ఆచారమే. ఆలయ ప్రాచుర్యం వాసికెక్కిన నాటినుండి నేటివరకు శ్రీరామనవమి వేడుకలు భద్రాచలాన్ని తలపిస్తాయి. ఆలయ అవరణలో నిర్వహించే స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని తిలకించడానికి వేలసంఖ్య లో శివపార్వతులు హాజరవుతారు. కళ్యాణవేడుకల్లో శివపార్వతులు ఒకరిపై ఒకరు తలంబ్రాలు పోసుకొని స్వామి వారిని వివాహం చేసుకున్నట్లుగా భావిస్తారు. ప్రతి యేడు జరిగే ఉత్సవాలకు శివపార్వతులు స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు. అంతేకాకుండా వేములవాడ ప్రాంతంలో ఏనాటి నుండే ఒక ఆచారం ఉంది. భక్తులు తమకు ఎదైనా కష్టం వచ్చినప్పుడు రాజన్నకు తమ బిడ్డల్లో ఒకరినిచ్చి వేస్తామని మొక్కుకుంటారు. ఆ బిడ్డ మగపిల్లవాడైతే శివుడు, ఆడపిల్లైతే పార్వతీ అన్నది వారి భావన. వారికి ఇక పెళ్లి చేయరు. తెలంగాణాలోనే అతిపెద్ద దేవాలయంగా, కోరిన కోర్కెలు తీర్చే రాజన్నగా ప్రఖ్యాతిగాం చింది ఈ ఆలయం.

(ఎంఎ మన్నాన్,
వేములవాడ)

తిరుపతి శ్రీనివాసమంగాపురంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా గజవాహన సేవలో విహరించిన శ్రీవారు.

ఎక్కడవేసిన గొంగళి అక్కడే

నిధులు లేక నీరసిస్తున్న జడ్పీలు
సమస్యలపై చర్చ తప్ప కానరాని పరిష్కారం
అరకొరనిధులు అసంపూర్తి పనులు

కరీంనగర్, ఫిబ్రవరి20(ఆర్ఎన్ఎ): జిల్లా పరిషత్ అంటే ప్రస్తుతం నిధులు లేక నీరసించి పోతున్నాయి. సమావేశాల్లో సమస్యలు చర్చించుకోవడమేకానీ తీసుకున్న నిర్ణయాలు అమలు చేసుకునే శక్తిలేని సంస్థగా మిగిలిపోతున్నది. కళ్ల ముందు నిత్యం కనిపిస్తున్న సమస్యలను పరిష్కరించలేని అశక్తత దాని సొంతం.

ఒకప్పుడు జిల్లా పరిషత్ అంటే రాజకీయ వేదిక. అభివృద్ధి పనులు చేపట్టి గ్రామీణ ప్రాంతాల్లో ప్రగతికి బాటలు వేసే కేంద్రంగా నిలిచేది. ఈ కార్యాలయం రోజూ ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయ సంఘల నాయకులు, ప్రజలతో కళకళలాడుతూ ఉండేది. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా తారుమారైంది. జడ్పీటీసీ సభ్యులు, మండల పరిషత్ అధ్యక్షులు తమతమ ప్రాంతాల సమస్యలతో గోడు వెళ్లబోసు కునేందుకు జిల్లా పరిషత్‌కు వస్తున్నారు. కొత్తగా ఏమైనా నిధులు ఇచ్చి సమస్యలకు పరిష్కారం చూపకపోతారా అనే ఆశతో ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలెన్నో వేధిస్తున్నాయి. మిషన్ భగీరథ నీరు ఇంకా అందే పరిస్థితి లేదు. దాని కారణంగా ఉన్న కొద్ది రోడ్లను కూడా తవ్వేశారు. పాత నీటి వనరులన్నీ నిరుపయోగంగా మారే పరిస్థితి నెలకొంది. పల్లెప్రగతి పేరిట సభలు, సమావేశాలు నిర్వహించినా పంచాయతీలపైన భారం మోపడమే తప్ప ప్రత్యేకంగా ఒరిగిందేమి లేదనే భావన ఉంది. మిషన్ కాకతీయ పథకం పనులు కూడా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. మూడు విడతల్లో పనులు ప్రారంభించినా మొదటి, రెండు విడుతల పనులు ఇంకా పూర్తికాలేదు. మూడో విడతలో కూడా అదే పరిస్థితి నెలకంది. మిషన్ భగీరథ కోసం రోడ్లను ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ, మండల, జిల్లా కేంద్రాలకు ఉన్న కనెక్టివిటీ రోడ్లను తవ్వి వాటిని అసంపూర్తిగా వదిలి వేయడంతో జిల్లాల్లోని అనేక గ్రామాల్లో చాలా చోట్ల రోడ్లు గుంతల మయంగా మారాయి. దీంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినా అభివృద్ధి పనుల్లో పురోగతి కనిపించడం లేదు. అనేక గ్రామాల్లోని కనెక్టివిటీ రోడ్ల పరిస్థితి ఇదే విధంగా ఉంది. దీనికి తోడు రోడ్డు పక్కన బావులు నిండుకుండల్లా నీటితో ఉన్నప్పటికి వాటి వద్ద ఎలాంటి హెచ్చరికలు, ప్రమాదం జరుగకుండా ఏర్పాట్లు చేయక పోవడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఎస్సారెస్పీ కెనాల్స్ పూర్తి సామర్థ్యంతో ప్రవహిస్తున్నాయి. కాలువల వద్ద ప్రమాద నివారణ చర్యలను తీసుకోక పోవడంతో ఇటీవల తిమ్మాపూర్ మండలంలోని ఎస్సారెస్పీ కెనాల్‌లో రెండు కార్లు, ఒక ద్విచక్ర వాహనం పడి ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. దెబ్బతిన్న రోడ్లు, ప్రమాద ఘంటికలు మోగిస్తున్న ఎస్సారెస్పీ కాలువలు, రోడ్డుపక్కన బావులతో దినదినం గండం నూరేళ్ల ఆయుష్షులా గ్రామీణ ప్రాంతాల ప్రజలు అరచేతిలో ప్రాణాలను పెట్టుకొని వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఆర్అండ్‌బీ, ఇరిగేషన్ శాఖల అధికారులు వీటిపై దృష్టిసారించక పోవడం వల్లనే తరుచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె ప్రగతిలో దంపుయార్డుల నిర్మాణం, శ్మశానవాటికల ఏర్పాటు, శిథిలావస్థలో ఉన్న భవనాల కూల్చివేత వంటి పనులు ఆశించిన మేరకు జరుగడం లేదు. హరితహారం మంచి పథకమే అయినా క్షేత్రస్థాయిలో జరుగుతున్న అవినీతి, అక్రమాలు, పర్యవేక్షణ లోపం కారణంగా ఆశించిన ఫలితాలు రావడంలేదు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఒక్కో మొక్కను నాటేందుకు గుంతను తవ్వితే 27.50 పైసలు కూలీ డబ్బులు చెల్లిస్తారు. గుంతలు తక్కువగా తవ్వి ఎక్కువ తవ్వినట్లు లెక్కలు చూపించి డబ్బులు కాజేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. కేంద్రం నుంచి జడ్పీలకు నిధులు రాక పోవడం, రాష్ట్ర ప్రభుత్వం సీనరేజీ వంటి నిధులను విడుదల చేయక పోవడంతో 15వ ఆర్థిక సంఘం నిధులపైనే ఆశలు పెట్టుకుంటున్నారు.

లక్షలు ఇవ్వకపోతే స్కూల్‌ను పేల్చేస్తా

పేపర్ ఆధారంగా విద్యార్థిని పట్టుకున్న పోలీసులు

లక్నో,ఫిబ్రవరి20(ఆర్ఎన్ఎ): ఓ విద్యార్థి తాను చదువుకుంటున్న స్కూల్‌నే పేల్చేస్తానని బెదిరింపు లేఖ పంపాడు. స్కూల్లో బాంబులు అమర్చానని.. రూ. 2 లక్షలు ఇవ్వాలని, లేని పక్షంలో ఆ బాంబులను పేల్చేస్తానని బెదిరించాడు విద్యార్థి. ఈ ఘటన బరేలిలోని ఓ పాఠశాలలో చోటు చేసుకుంది. స్కూల్ మేనేజర్ అనిల్ సింగ్ కథనం ప్రకారం.. తమ పాఠశాలకు ఆదివారం ఓ లేఖ వచ్చింది. రూ. 2 లక్షలు ఇవ్వకపోతే పుల్వామా ఉగ్రదాడి తరహాలో మీ పాఠశాలను పేల్చేస్తానని లేఖలో పేర్కొన్నారు. ఇప్పటికే స్కూల్లో బాంబులు పెట్టానని లేఖలో తెలిపారు. దీంతో తాము అప్రమత్తమై పోలీసులకు సమాచారం అందించాం. డాగ్ స్క్వాడ్ బృందం తనిఖీలు జరిపి పాఠశాలలో ఎలాంటి బాంబులు అమర్చలేదని స్పష్టం చేశారు. మళ్లీ మంగళవారం మరో లేఖ వచ్చింది. రూ. 2 లక్షలు ఇవ్వాలని లేఖలో డిమాండ్ చేశారు. చేసేదేమీ లేక స్కూల్ సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అయితే ఆ లేఖకు ఉపయోగించిన పేపర్‌పై పోలీసులు దృష్టి సారించారు. ఆ పేపర్ అదే స్కూల్‌కు చెందిన సైన్స్ నోట్‌బుక్‌లోనిదిగా గుర్తించారు. అది కూడా 9, 10 తరగతి విద్యార్థుల నోట్‌బుక్స్‌లోని పేపర్. ఈ పేపర్ ఆధారంగా లేఖ రాసిన విద్యార్థిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే ఈ లేఖ రాయడంలో అతని ప్రమేయం లేదని, మరో వ్యక్తి ప్రమేయం ఉందని పోలీసులు తేల్చారు.

26 నుంచి యాదాద్రి బ్రహ్మోత్సవాలు

4న కళ్యాణోత్సవం ఉంటుందన్న ఇవో

యాదాద్రిభువనగిరి,ఫిబ్రవరి20 (ఆర్ఎన్ఎ): ఈ నెల 26 నుంచి మార్చి 7వ తేదీ వరకు యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్స వాలను నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో గీత వెల్లడించారు. యాదాద్రి బ్రహ్మోత్స వాల నిర్వహణపై ఈవో గీత మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. మార్చి 3న ఎదుర్కోలు, 4న కల్యాణం, 5న రథోత్సవం ఉంటుందని ఆమె తెలిపారు. మార్చి 7న అష్టోత్తర శతఘటాభిషేకంతో బ్రహ్మోత్స వాలు ముగుస్తాయని చెప్పారు. యాదాద్రి బ్రహ్మోత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నామని, గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్, సీఎం కేసీఆర్, మంత్రులు హాజరయ్యే అవకాశం ఉందన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని ఈవో గీత పేర్కొన్నారు. ఇదిలావుంటే యాదా ద్రి శ్రీలక్ష్మీ నరసింహ స్వామివారి అనుబంధ ఆలయం శివాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు కొనసాగ ుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ధ్వజపటారోహణం చేశారు. మరోవైపు మహాశివరాత్రి ఉత్సవాలు అ త్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయ శివాలయంలో వేదమూర్తులైన బ్రహ్మణోత్తములచే ధ్వజపటారోహణ మహోత్సవంతోపాటు భేరీ పూజ, దేవతాహ్వానం, అగ్నిప్రతిష్ఠ, స్మార సాంప్రదాయానుసారంగా యజ్ఞబ్రహ్మ నిర్వహించారు. అనంతరం నిత్యాహవనం, శివ పంచాక్షరీ జపాలు, నందీశ్వర పారాయణాలు, పంచసూక్త పఠనాలు చేశారు. మూలమంత్ర జపాలు, వివిధ పారాయాణాలు పారాయణీక్తులు చేశారు. ఈ వేడుకల్లో ఆలయ ఆనువంశిక ధర్మకర్త బి. నరసింహమూర్తి, ఈవో గీత, ఏఈవోలు, పర్యవేక్షకులు, ఉద్యోగ సిబ్బంది, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఇద్దరు హాకీ క్రీడాకారుల దారుణ హత్య

చండీఘడ్,ఫిబ్రవరి20 (ఆర్ఎన్ఎ): పాటియాలాలో ఇద్దరు హాకీ క్రీడాకారులు దారుణ హత్యకు గురయ్యారు. నగరంలోని ప్రతాప్ నగర్ ప్రాంతంలో ఒక ధాబా వద్ద గుర్తు తెలియని వ్యక్తులు వారిని హత్య చేశారు. మృతులను అమ్రిక్ సింగ్, సిమ్రంజిత్ సింగ్‌గా గుర్తించారు. అమ్రిక్ సింగ్ జాతీయ స్థాయి హాకీ క్రీడాకారుడు కాగా, సిమ్రంజిత్ సింగ్ ఇటీవలే భారత హాకీ బృందానికి ఎన్నికయ్యాడు. ధాబా వద్ద వీరిద్దరికీ మరికొందరితో ఘర్షణ జరిగిందని ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. పోలీసులు మృత దేహాలను ప్రభుత్వ రాజేంద్ర ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శ్రుతిమించిన మూఢ విశ్వాసాలు

కాపురంలో కలహాలకు దారితీసిన భార్య చర్యలు
ఆవేశంలో భార్యను చంపి భర్త ఆత్మహత్య

బెంగళూరు,ఫిబ్రవరి20(ఆర్ఎన్ఎ): ఆమెకు కులమతాలపై విశ్వాసాలు ఎక్కువ. శుచి, శుభ్రతకు ఆమె మారుపేరు. ఎల్లప్పుడూ పవిత్రంగా ఉండాలని కోరుకుంటుంది. భర్త, పిల్లలు బయటి నుంచి ఇంట్లోకి వస్తే కచ్చితంగా స్నానం చేయాల్సిందే. భార్య పద్ధతులు భరించలేక భర్తే ఆమెను హత్య చేశాడు. ఆ తర్వాత తాను ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మైసూర్ జిల్లాలోని మండహళ్లిలో మంగళవారం చోటు చేసుకోగా ఆలస్యంగా వెలుగు చూసింది.

వివరాల్లోకి వెళ్తే ..శాంతమూర్తి(40), పుట్టమణి(38) దంపతులకు 15 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే పెళ్లి అయినప్పటి నుంచి పుట్టమణి శుచి, శుభ్రతకు అత్యధిక ప్రాధాన్యమిస్తున్నారు. ఆమెకు కులమతాలపై విశ్వాసం ఎక్కువ ఉండడంతో.. తూచా తప్పకుండా పద్ధతులు పాటించేది. ఇంట్లో నుంచి బయటకు వెళ్లి.. మళ్లీ తిరిగి ఇంటికొచ్చిన తర్వాత తప్పకుండా ప్రతి ఒక్కరూ స్నానం చేయాలి. ఇలా రోజుకు భర్తతో పాటు పిల్లలు కనీసం పదిసార్లు అయినా స్నానం చేయాల్సి వచ్చేది. అంతే కాదు పిల్లల స్కూల్ బ్యాగులకు కూడా ఆమె సాయంత్రం వేళ ప్రోక్షణ చేసేది. ఇక తన భర్త తెచ్చే కరెన్సీ నోట్లను కూడా కడిగి ఆరబెట్టేది. దీంతో ఈ మధ్య కాలంలో పుట్టమణి విశ్వాసాలు శ్రుతి మించడంతో.. భర్త విసుగు చెందాడు. మంగళవారం పొలం వద్దకు తీసుకెళ్లి కొడవలితో ఆమెను నరికి చంపాడు. ఆ తర్వాత తాను ఇంటికొచ్చి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై ప్రభుస్వామి అనే స్థానికుడు స్పందించాడు. పుట్టమణి లాంటి మహిళను తన జీవితంలో ఎప్పుడూ చూడలేదు. గత ఎనిమిదేళ్ల నుంచి ఆమెకు విశ్వాసాలు ఎక్కువ అయ్యాయి.

ఆమె ఇంట్లోకి అడుగుపెట్టాలంటే తమకు భయమేసేది. ఎందుకంటే ఇంట్లోకి అడుగుపెట్టాలంటే కచ్చితంగా స్నానం చేయాలని పుట్టమణి డిమాండ్ చేసేది అని ఆయన తెలిపాడు. పుట్టమణి బంధువు రాజశేఖర్ స్పందిస్తూ.. భర్త తీసుకువచ్చే కరెన్సీ నోట్లను కూడా ఆమె కడిగి ఆరబెట్టేది. ఎందుకంటే.. అవి ఏ కులానికి, మతానికి చెందిన వారో ఇచ్చారనే అనుమానం పుట్టమణికి ఉండేది. కుల,మత విశ్వాసాల మీద ఆమెకున్న నమ్మకంతో ఇంట్లో వారందరిని విసిగిస్తూ ఉండేదని రాజశేఖర్ చెప్పాడు. టాయిలెట్‌కు వెళ్లినా కూడా స్నానం చేయాలని ఆమె డిమాండ్ చేసేదన్నారు రాజశేఖర్. అయితే మంగళవారం ఉదయం పుట్టమణి, శాంతమూర్తికి మధ్య గొడవ జరిగిందని ప్రభుస్వామి తెలిపాడు. వరిధాన్యం అమ్ముకొచ్చి వచ్చిన డబ్బులను భార్యకు ఇచ్చాడు. అయితే ఆ డబ్బులను ఆమె కడిగి ఆరబెట్టింది. ఈ క్రమంలో ఇరువురి మధ్య గొడవ మొదలైంది అని ప్రభు పేర్కొన్నాడు. దీంతో తీవ్ర ఆగ్రహావేశాలకు లోనైన శాంతమూర్తి ఈ ఘాతుకానికి పాల్పడి ఉండొచ్చని ఆయన తెలిపాడు.

కొడ్వటూరులో శివరాత్రి వేడుకలు

జనగామ,ఫిబ్రవరి20(ఆర్ఎన్ఎ): జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలోని కొడవటూరు సిద్ధేశ్వరాలయంలో శివరాత్రి ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు చేశారు. ఇక్కడ నిర్వహించే సిద్ధేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు, శివకళ్యాణానికి ఏటా వేలాదిగా భక్తులు వస్తారు. మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని శివపార్వతుల కళ్యాణం నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాలు కన్నులపండువగా జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

మద్యంషాపు యజమానికి బెదరింపులు

ముంబై,ఫిబ్రవరి20(ఆర్ఎన్ఎ): మద్యం షాపు యజమాని నుంచి ప్రతీ నెలా రూ.7 లక్షలు దోపిడీ చేసేందుకు యత్నించిన కేంద్రప్రభుత్వ ఉద్యోగిని ముంబై మెరైన్ డ్రైవ్ పోలీసులు అరెస్ట్ చేశారు.

రక్షణ మంత్రిత్వ శాఖలో కార్మికుడిగా పనిచేస్తున్న రాజేంద్ర వాగ్‌మరే అనే ఉద్యోగి దక్షిణ ముంబైలో మద్యం షాపు నిర్వహిస్తున్న అశోక్ పటేల్ దగ్గరకు వచ్చాడు. మద్యం షాపు లైసెన్స్ నిబంధనల ప్రకారం లేదని, అందుకు తాను ప్రతీ నెలా రూ.7లక్షలు విలువ చేసే సరుకు అమ్ముకుంటానని అశోక్ పటేల్‌ను బెదిరించాడు. దీంతో